మహబూబ్‌నగర్

వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి తారను కలిసిన ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం

# మహబూబ్‌నగర్ అభివృద్ధికి సహకరించండి

**మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ**

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి, తారను కలిసిన ఎంపీ**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 21 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ క్లస్టర్ అభివృద్ధికి సహకరించాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి తారను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం క్లస్టర్ అభివృద్ధికి సంబంధించిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించిన నేపథ్యంలో, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి తార డిల్లీలోని కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణతో కలిసి మహబూబ్‌నగర్ క్లస్టర్ (మహబూబ్‌నగర్, బూత్పూర్, జడ్చర్ల) అభివృద్ధి పైన చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అభివృద్ధికి నోచుకోక పోవడంతో మహబూబ్ నగర్ అంటేనే వెనుకబడిన జిల్లాగా, వలసల జిల్లాగా, లేబర్ జిల్లాగా పేరుగాంచిందన్నారు. ఈ క్లస్టర్ లోని మూడు – మిగతా4లో..



పిహెచ్‌సిలో చిన్నారితో మాట్లాడుతున్న కలెక్టర్

# పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్

**నారాయణ పేట, ఆగస్టు 21 ప్రభాతవార్త :** మరికల్ మండల కేంద్రం లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తనిఖీ చేశారు. ఆస్పత్రి లో ఉన్న మందుల గదికి వెళ్లి నిల్వ ఉన్న వివిధ రకాల మందులను ఆమె పరిశీలించారు. ఎన్ని నెలలకు మందుల సరఫరా జరుగుతుందని మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిపరిధిలో ఉన్న 7సబ్‌సెంటర్లకు మందులను పంపిస్తున్నారా లేదా అని ఆరా తీశారు మందుల జాబితాను చూశారు. పక్కనే ఉన్న టీకాలగదిలోకి వెళ్ళి ఫ్రిజ్‌లో నిల్వఉంచిన పలు వ్యాక్సిన్లను పరిశీలించారు. గది ముందు వేసిన కాలం చెల్లిన మందులను చూసి వాటిని ఎక్కడ పడితే అక్కడ పెడితే – మిగతా4లో..



వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్న కలెక్టర్ సంతోష్

# పనితీరు మెరుగుపరచాలి

**గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్**

**గద్వాల టౌన్ ,ఆగస్టు 21, ప్రభాతవార్త:** జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖలో సిబ్బంది పనితీరును సమర్ధవంతంగా మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు ప్రభుత్వ ఆసుపత్రులు, పీ.హెచ్.సీల పనితీరుపై వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ – మిగతా4లో..

# ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట, ఆగస్టు 21ప్రభాతవార్త :** రాబోయే మిలాద్ ఉన్ నబి, వినాయక చవితి పండుగలను శాంతియుతంగా, మతసామరస్యంతో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ పిలుపునిచ్చారు. ఎస్పీ కార్యాలయంలో ముస్లిం మత పెద్దలతో జరిగిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో డీజేలకు అనుమతి లేదని, ఉల్లంఘన చేస్తే పరికరాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు జెండాలు ఎప్పటిలాగే స్థలాల్లోనే కట్టాలని, పండగల అనంతరం వెంటనే తొలగించాలని సూచించారు పండగల సమయంలో సమస్యలు వస్తే వెంటనే పోలీసులకు లేదా డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.డి.రియాజ్ హుల్ హక్, సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరులో

# రెట్టింపు వర్షపాతం

- రాష్ట్రంలో రెండో స్థానం
- అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి
- ఓపెన్ ప్లాట్ లపై దృష్టి సారించాలి యజమానులకు నోటీసు జారీ చేయాలి
- దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించిన రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్
- కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో వర్షాలు కారణంగా తలెత్తిన పరిస్థితులపై,
- సహాయక చర్యలపై సమీక్ష
- సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం



మాట్లాడుతున్న అరవింద్ కుమార్, చిత్రంలో కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 21 ప్రభాతవార్త:** గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలో ప్రాణ ఆస్తి నష్టం లేకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి సమన్వయంతో చర్యలు తీసుకుందని రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో (కలెక్టరేట్)లో వి.సి కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్.పి.డి జానకి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అధనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులతో శాఖల వారీగా వరదల వల్ల జరిగిన నష్టాలు, నివారణ సహాయక చర్యలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ బి, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ, మున్సిపల్ కమిషనర్ లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఇరిగేషన్ శాఖ, విద్యుత్ శాఖ, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశు సంవర్ధక, రెవెన్యూ పంచాయతీ శాఖల అధికారులు శాఖల వారీగా వర్షాల వలన తలెత్తిన పరిస్థితులు తీసుకున్న చర్యలు పై వివరించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జూన్ నుండి ఇప్పటి వరకు 336.9 మి.మీ.సాధారణ వర్ష పాతంకు గాను 618.3 మి.మీ. వర్ష పాతం నమోదైందని, రాష్ట్రం లో సాధారణ వర్షపాతం కన్నా అత్యధికంగా వర్ష పాతం నమోదైన జిల్లా లలో రెండవ స్థానంలో ఉందని, 83.5 శాతం అధికంగా నమోదైందని అన్నారు. ఇంకా నెల రోజుల పాటు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, మళ్ళీ అల్పపీడనం కారణంగా అత్యధిక వర్షపాతం నమోదు జరిగే అవకాశం ఉందని, ఎక్కువ వర్షపాతం క్లౌడ్ బరస్ట్ జరిగితే జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండి అన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అధిక వర్షపాతం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనాలు అనుసరించి లో లెవెల్ కాజ్‌వేల దగ్గర వర్షపు నీరు ప్రవహించి వాహన దారులు, పాదచారులు వర్షపు నీటిలో కొట్టుకుపోయే సంఘటనలు జరుగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పట్టణ, గ్రామ ప్రాంతాలలో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న నివాసితులను సురక్షి త ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వర్షాల వలన ఎటువంటి సంఘటనలు జరుగకుండా జిల్లా కలెక్టర్, ఎస్.పి., ఎస్.డి.ఆర్. ఎఫ్, అధికార యంత్రాగం సరైన చర్యలు తీసుకున్నారని, మూసా పేట మండలం లో ఆగస్టు 13 రాత్రి కురిసిన వర్షానికి పో గ్రామ శివారులో కప్పెట, పెద్దమ్మ వాగు మధ్య నీటిలో చిక్కిన 10 మంది గొర్రెల కాపరులు, 970 గొర్రెలను అగ్నిమాపక శాఖ, ఎస్.డి.ఆర్.ఎఫ్, పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో వ్యవహరించి రక్షి ంచడం అభినందనీయం అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎటువంటి అంటూ రోగాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ, మున్సిపల్ శాఖల సమన్వయంతో తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా ఓపెన్ ప్లాట్ లపై దృష్టి సారించాలని, వర్షపు నీరు, చెత్త తొలగింపుకు యజమానికి నోటీసు జారీ చేయాలని సూచించారు. జిల్లాకు ఒక కోటి రూపాయలు కేటాయించినట్లు, అత్యవసర పరిస్థితిలో తగిన విధంగా వినియోగించుకోవాలని అన్నారు. ఆర్ బి, పంచాయతీ రాజ్, మున్సిపల్ అధికారులు వర్షాల వలన దెబ్బ తిన్న కాజ్ వే లు, రోడ్లు, అంచనా వివరాలు పి.డి. ఎస్. ఏ ఫార్మాట్‌లో ఇంజనీర్ ఇన్ చీఫ్ అధికారులకు నిధుల కొరకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. వ్యవసాయ శాఖ పంట నష్టం, ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజులుగా కురిసిన భారీ వర్షం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఆగస్టు 14 న ఎక్కువ వర్షపాతం నమోదు అయిందని, జడ్చర్లలో 12 సెంటి మీటర్లు, కొన్ని మండలాల్లో 9 సెంటి మీటర్లు నమోదు జరిగినట్లు తెలిపారు. లో లెవెల్ కాజ్‌వేలు వరద నీరు ప్రవాహం ఉందని అన్నారు జిల్లాలో చెరువుల్లో పూర్తిగా నిండినవి, 75 శాతం నిండిన చెరువులు ఉన్నాయని వివరాలు తెలిపారు. వర్షపు నీరు వలన లో లెవెల్ కాజ్‌వేల పై బారికేడింగ్ ఏర్పాటు చేసి,ట్రాఫిక్ ను మళ్లించి ఎటువంటి సంఘటనలు జరుగ కుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మండలంలో ఏంపిడి ఓ., తహశీల్దార్, ఎస్.ఐలతో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు, పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. వర్షాల వలన ఒక ఇండ్లు పూర్తిగా 70ఇండ్లు పాక్షి కంగా నష్టం జరిగిందని, వీటికి తహశీల్దార్‌లు నష్టంకు ఆర్థిక సహాయానికి ప్రతిపాదనలు పంపి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో 300 మంది ఆపద మిత్రలు ఎస్.హెచ్.జీ., ఎక్స్, సర్వీస్ మెన్ కు శిక్షణ నిర్వహించి గ్రామాల్లో అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్పీ డి జానకి, స్థానిక సంస్థల అదన కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సాంఘిక సంక్షేమ(బాలికల) గురుకుల జూనియర్ కళాశాల సందర్శన, విద్యార్థినులతో కలిసి భోజనం**

జడ్చర్ల మండలం చిట్టిబోయినపల్లి సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి వారితో కలిసి విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి భోజనం చేశారు. గురుకుల పాఠశాలలో వంట గది, స్టోర్ రూమ్ పరిశీలించారు.

# నేరాలే ప్రవృత్తిగా దొంగతనాలు

- దొంగతనం కేసులను ఛేదించిన వనపర్తి రూరల్ పోలీసులు
- నేరస్తుడు అరెస్ట్ 11 లక్షల 43 వేలు నగదు, 30 గ్రాముల బంగారం హోండా షైన్ బైక్ 1 మొబైల్ ఫోన్ స్వాధీనం..
- మీడియాకు వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

**వనపర్తి, ఆగస్టు 21 ప్రభాతవార్త:** నేరాలకు పాల్పడుతూ దొంగతనాలు ప్రవృత్తిగా మార్చుకున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. నిందితుని వివరాలు పానగల్ మండలం ముసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మీనుగ రమేష్ (32) వనపర్తి సీఐ, కృష్ణయ్య సూచనల మేరకు గురువారం ఉదయం 5:30 గంటల సమయములో వనపర్తిరూరల్ 2వఎస్సై, సిబ్బంది వనపర్తి పట్టణపరిధిలో గల మర్రికుంట బస్ స్టాప్ దగ్గర రోడ్డుపై వాహనాలను తనిఖీ చేస్తుండగా, నేరస్తుడు తన మోటార్ సైకిల్‌పై వనపర్తికి వస్తుండగా, తన బైక్ డాక్యుమెంట్ అడు గుతూ మోటార్ సైకిల్‌ను తనిఖీ చేయగా, మోటార్ సైకిల్ ట్యాంక్ కవరులో నగదు, స్క్రూ డ్రైవర్ హాక్సా బ్లేడు అతని వద్ద ఉన్నట్లు పోలీసులు తెలి పారు. అనుమానం వచ్చి నేరస్థుని విచారించగా సరైన వివరణ ఇవ్వనందున, అతనిని అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు, తన చేసిన నేరాలను ఒప్పుకొని, అతని వద్ద దొంగిలించిన సొత్తును స్వాధీనపరుచుకొని, అరెస్టు చేసి రిమాం డ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. నేరస్తుని నుండి11 లక్షల 43వేలు నగదు 30 గ్రాముల బంగారం హోండా షైన్‌బైక్ 1 మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నేరస్తునిపై వివిధ పోలీస్‌స్టేషన్లో నమోదైన కేసులు ఈవిధంగా ఉన్నాయి1)వనపర్తి రూరల్, బిజినేపల్లి, కొత్తకోట పోలీ స్టేషన్లో వివిధ దొంగతనం కేసులు నమోదయ్యాయని ఎస్పీ తెలిపారు. ఈ నేరస్థులను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన వనపర్తి సీఐ, కృష్ణయ్య, వనపర్తి రూరల్ ఎస్సైలు, జలంధర్ రెడ్డి, వేణుగోపాల్ పోలీసు కానిస్టేబుళ్ల రఫి, అంజనేయులు, నవీన్ గౌడ్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డు అందజేసి అభినందించారు. అదేవిధంగా దొంగతనాలను ప్రవృత్తిగా మార్చుకొని నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు. పదేపదే పోలీసు హెచ్చరికలను పెడచెవిన పెడుతూ నేరాలకు పాల్పడుతున్న వారిపై పిడి యాక్ట్ సైతం నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో డిఎస్పి వెంకటేశ్వరరావు సిఐ కృష్ణయ్య ఎస్సైలు పోలీస్ కానిస్టేబుల్‌లు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిక్కుడు వంశీ కృష్ణ

## పేదింటి బిడ్డలకు

# కళ్యాణ లక్ష్మి వరం

**అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**

**వంగూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త:** పేదింటి ఆడబిడ్డల వివాహాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్ పథకాల పేరుతో రూ. 1,00,016ల అందిస్తుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం అచ్చంపేట అంబేద్కర్ భవన్ కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు తమ ఆడపిల్లల వివాహాలు జరిపించలేక ఎన్నో అవస్థలు పడుతూ ఇబ్బందులకు గురవుతున్నారనే ఆలోచనతో ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల ద్వారా సహకారాన్ని అందిస్తూ పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రులకు అండగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తుందని ఆయన సూచించారు. ఇప్పటికే 6 గ్యారంటీలలో అమలుపరుస్తూ పేద ప్రజలకు అండగా ఉంటూ రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులు ఉన్నారు.



రొడ్డును పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్

## వరద ప్రాంతాల్ని పరిశీలించిన ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

- పాల్గొన్న జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి, జిల్లా ఎస్పీ డి జానకి, ఎమ్మార్వో, ఎంపీడీఓ, కమిషనర్ ఇతర అధికారులు
- భీకర వర్షానికి తెగిన అమరరాజ కంపెనీ, కోమటికుంట, రాందాస్ తండా రోడ్ల పరిశీలన

# పల్లె రోడ్లు ఛిద్రం..

**అధ్వానంగా రహదారులు బాగయ్యేనా...**

**ప్రజలకు తప్పని ఇక్కట్లు**

**పుట్టపల్లి, వెంకటగిరి రోడ్లు అద్వానం.**



బురదమయంగా మారిన రోడ్డులో లారీ దిగబడ్డ దృశ్యం

**దేవరకద్ర, ఆగస్టు 21 ప్రభాతవార్త:** అసలే అద్వాన రోడ్లు... ఆపై వర్షాకాలం.... ఇంకేముంది చిన్నచిన్న వానాలకే పల్లె రోడ్లు పూర్తిగా చిద్రమయ్యాయి. ఈ మట్టి రోడ్ల పైన, బీటి రోడ్ల పైన, పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి బురద మాయంగా మారాయి. దీంతో వాహన దారులు ఆ రోడ్లపై ప్రయాణించాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. ఇక పాదాచారుల పరిస్థితి మరి అద్వానం. ఈ అద్వాన రహదారులు ఎప్పుడు బాగుపడతాయో, ఈ రహదారులపై ప్రయాణం చేయాలంటే ప్రాణం అరచేతులో పెట్టుకోవాల్సిందేనా... వివరాల్లోకి వెళ్తే కౌకుంట్ల మెయిన్ రోడ్డు నుండి పుట్టపల్లి రైల్వే గేటు మీదగా వెళ్లే రహదారి, వెంకటగిరి నుండి కురుమూర్తి దేవస్థానానికి వెళ్లే రహదారి బురదతో, గుంతలతో, దర్శనమిస్తుంది. ఈ రహదారులు గుంతల మయంగా మారాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో ఆ గుంతల్లో వర్షపు నీరు చేరడంతో వాహనాలు వెళ్ళలేని పరిస్థితి నెలకొంటుంది. వెంకటగిరి రహదారి మాత్రం అధ్వానంగా మారింది. వారం రోజుల నుండి టూవీలర్ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రెండు రోజుల నుండి లారీ గుంతలో ఇరుక్కుపోవడంతో వాహనాలు వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. ఈ పల్లె రహదారులు ప్రమాదకరంగా మారాయి. గతుకుల రోడ్లపై ప్రయాణం నరక ప్రాయంగా మారింది. ఇవే రోడ్లపై నుంచి ప్రజా ప్రతినిధులు ,నాయకులు, అధికారులు, వెళ్తున్న వాటి మరమ్మత్తులను మాత్రం పట్టించుకోవడం లేదు.

**రైల్వే పనులు నత్త నడకన..**



వెంకటగిరి రైల్వే పనులు రెండు సంవత్సరాలైనా పూర్తి కాలేదు. ఈ రైల్వే పనులు నత్తనడకన నడుస్తున్నాయి. రైల్వే ప్లాన్ కరెక్ట్ లేదు. రైల్వే అండర్ బ్రిడ్జి యూటర్న్ తీసుకున్నారు. ముున్ముందు అనేక ఇబ్బందులు వస్తాయి. ఆ ప్లాన్ ఇచ్చిన ఇంజనీర్ దానిమీద అవగాహన లేకుండా పనులు చేస్తున్నారు. బడ్జెట్ తక్కువైతదని యూటర్న్ ప్లాన్ చేశారు. అక్కడ వెహికల్ మల్ల లేని పరిస్థితి నెలకొంటుంది. ముున్ముందు ప్రమాదాలు జరిగే పరిస్థితి ఏర్పడతాది. అదేవిధంగా దేవరకద్ర మండలం, డోకూర్ రైల్వే అండర్ బ్రిడ్జి పనులు కూడా నత్తనడకన పూర్తి చేసి, వర్షం వస్తే వరద నీరు వెళ్లేందుకు ప్రత్యేక ఏర్పాటు చేయకపోవడంతో ఇటీవల నీట మునిగింది. డోకుర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

**సాంబశివుడు, కౌకుంట్ల**

**ప్రణాళిక లోపంతో..**



వెంకటగిరి గ్రామం. మా వెంకటగిరి గ్రామంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం ప్రణాళిక లేకుండా చేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వస్తే రెండు వేకిల్స్ ఆ బురదలో ఇరుక్కుపోవడం జరుగుతుంది. రైల్వే అధికారులు రైల్వే గేటు ముయ్యడంతో రాకపోకలకు ఇబ్బందులు కలిగించారు. మా పొలాలకు వెళ్లాలన్న ఇబ్బందికరంగా ఉంది. రైల్వే అధికారులు గ్రామస్తులకు చెప్పకుండా రైల్వే గేట్ మూసివేశారు. రెండు సంవత్సరాలు అయినా రైల్వే పని పూర్తి కాలేదు. ఇది పూర్తిగా రైల్వే అధికారులు, సబ్ కాంట్రాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి నిర్లక్ష్యం కనిపిస్తుంది. ఒక్కసారి కూడా రోడ్డును మరమ్మత్తు చేపట్టలేదు.

**పెబ్బేటి నారాయణరెడ్డి.**

**ప్రయాణం చేయడం నరకమే..**



కౌకుంట్ల మెయిన్ రోడ్డు నుండి పుట్టపల్లి రైల్వేగేట్ వరకు ఒక్కసారి కూడా ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు. అత్యవసర సమయాల్లో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎన్నో సంవత్సరాల నుండి ఇదే దుస్థితి నెలకొంది. రోడ్డు దుస్థితి అద్వానంగా ఉండడంతో ప్రయాణికులకు ప్రత్యామ్నాయ మార్గం లేకుండా పోయింది. గుంతలతో నిండి ఉన్న రోడ్డుపై ప్రయాణం చేయడం నరకమే.

**నరేష్ కౌకుంట్ల.**

**పుట్టపల్లి రోడ్డును ఎవరు బాగు చేయరా..**



కొన్ని సంవత్సరాలుగా పుట్టపల్లి రోడ్డు అద్వానంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. ఈ బీటీ రోడ్డుపై రాళ్లు పైకి తేలడంతో రోడ్ అంతా గుంతలుగా ఏర్పడి ఉంది. దీంతో వర్షం కురిసినప్పుడు ఆ నీరు అంతా గుంతల్లో నిండిపోయి ఉండడంతో రోడంత బురదమయంగా మారింది. ఈ రోడ్డుమీద ప్రయాణం సాగించాలంటే మేము పడుతున్న కష్టాలు అన్ని ఇన్ని కావు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రహదారి ఏళ్ల తరబడి శిథిలావస్థలో ఉన్నప్పటికీ, అటు రైల్వే అధికారులను అడిగిన, ఇటు ఆర్అండ్ బి అధికారులను అడిగిన ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ఈ రోడ్డు మాది కాదు, మాది కాదు, అని చేతులు దులుపుకుంటున్నారు.

**తుమ్మల రామ్‌రెడ్డి పుట్టపల్లి**

## చత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టాపనకు స్థలం కేటాయించాలి


తహసీల్దార్ కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

**అమరచింత ఆగస్టు 21, ప్రభాతవార్త:** అమరచింత మునిసిపల్ కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ చౌరస్తాలో చత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టాపనకు స్థలం కేటాయించాలని చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ ఆధ్వర్యంలో గురువారం మండల తహసిల్దార్ రవికుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన అధ్యక్షులు, దేవర్ల సురేష్, ప్రధాన కార్యదర్శి, డిసి దామోదర్,దుబాయ్ వెంకటేశ్వర్ రెడ్డి, రాకేష్ గౌడ్, క్యామ భరత్ మాట్లాడుతూ, శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన కొరకు స్థలం కేటాయించాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు, డాక్టర్ వాకిటి శ్రీహరి నీ కలిశామని అలాగే మున్సిపల్ అధికారులను కలసి వినతి పత్రాలు అందజేశామని వారు తెలిపారు. చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు కోసం పట్ట ణ ప్రజలు, యువకులు, విద్యార్థులు, వ్యాపారస్తులు, విద్యావేత్తలు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపక నాయకులు వినోద్ కుమార్, హర్ష శ్రీనివాస్, బాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

## వయోవృద్ధుల చట్టాలపై అవగాహన

**గద్వాల టౌన్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫీస్ లో జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల చట్టాల గురించి, చట్టపరమైన సమస్యల గురించి పెన్షన్ సమస్యల గురించి మరియు కుటుంబ సమస్యల గురించి చర్చించారు. చట్టసంబంధిత అంశాలపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధుల సమస్యలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవాలని సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకోవచ్చు అన్నారు. న్యాయ సహాయం పొందే విధానం, లీగల్ ఎయిడ్ సేవలు ఎలా ఉపయోగించుకోవాలి అనే దానిపై స్పష్టతనిచ్చారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ వి. రాజేందర్, బి. శ్రీనివాసులు, డి. లక్ష్మణ స్వామి, యూనియన్ సంఘం అధ్యక్షుడు మోహనరావు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## ఏటిసిలో ప్రవేశాల కొరకు ప్రత్యేక జాబ్ మేళా


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగ రావు

**గద్వాలటౌన్ , ఆగస్టు 21, ప్రభాతవార్త:** ఏ టి సి లో ప్రవేశాల కొరకు నిర్వహించడం జరుగుతుం దని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు తెలిపారు. యువతకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన నైపుణ్య శిక్షణ అందించడానికి ఏ టి సి సెంటర్ ఒక మంచి వేదికగా నిలుస్తోందని, ఎక్కువ మంది యువతను ఇందులో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. గురువారం ఐడిఓసి లో జరిగిన ప్రత్యేక సమావేశంలో టి గేట్ కమిటీ సభ్యులు, ఏపిఎం లు, యూనిసెఫ్ ప్రతినిధుల సమక్షంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ, ఏ టి సి సెంటర్ లు శెట్టి ఆత్మకూరు, గద్వాలలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక జాబ్ మేళా జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఐ డి ఓ సి లో ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించబడనుందని తెలిపారు. ఎస్.ఎస్.సి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, బీటెక్, ఎంసీఏ/ఎంబీఏ అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ కోరారు.

## డా. పి.నర్సింహా రెడ్డి సేవలు మరువలేనివి

**నారాయణ పేట ఆగస్టు 21 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి స్కూల్లో లయన్స్ క్లబ్ మాజీ డిస్టిక్ గవర్నర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ డా. పి.నర్సింహా రెడ్డి 77 వ జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి తన భార్య పి.లలిత ఉపాధ్యాయులు, మరియు విద్యార్థులు పూలమాల వేసి నివాళులు అర్పించి మిఠాయి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు వెనుకబడ్డ నారాయణ పేట జిల్లాలోని విద్యార్థులకు ఇంగ్లీష్ విద్యను,జిల్లాలోని అన్ని గ్రామాల పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలను మరియు ధర్మాలకు అతీతంగా అన్ని పండుగలకు చేసే సేవ కార్యక్రమాలను విద్యార్థులకు తెలియ చేశారు.వారి యొక్క ఆశయాలు నెరవేర్చుటకు అందరూ కృషి చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమీనా, హెచ్.నర్సింహా, సురేందర్ గౌడ్, రాధాకిషన్, హరీష్ విద్యార్థులు పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దు మహాధర్నా విజయవంతం చేయాలి

**ఉప్పునుంతల, ఆగష్టు 21 ప్రభాతవార్త** : పిఆర్‌టియు టీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న సిపిఎస్ రద్దు పై నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిఆర్‌టియు ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పిఎంసి జెడ్‌పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాల ఆవరణలో పిఆర్‌టియు టీఎస్ నాగర్ కర్నూల్ జిల్లా గౌరవ అధ్యక్షులు సభావత్ బిచ్యానాయక్ ఆధ్వర్యంలో గోడ పత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద జరిగే మహాధర్నాలో పెద్ద ఎత్తున సిపిఎస్, ఓపిఎస్ ఉద్యోగులు పాల్గొని మహాధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు టిఆర్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మేడి పూరి మల్లికార్జున్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి అజ్మతుల్లా, రాష్ట్ర సీనియర్ బాధ్యులు రాములు నాయక్, మండల ప్రధాన కార్యదర్శి ఎండి అమీర్ పాషా, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

**చిన్నచింతకుంట, ఆగస్టు 21 ప్రభాతవార్త :** మండలంలోని పల్లమర్రి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త దండు చంద్రయ్య కొన్ని రోజుల క్రితం గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలిసి దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశానుసారం గురువారం మండ ల బిఆర్ఎస్ పార్టీ నాయకుల తరపున ఆ కుటుంబానికి ఆదుకోవాలనే ఉద్దేశం తో 35 వేలు రూపా యలను దండుచంద్రయ్య భార్య పల్లవి బిఆర్ఎస్‌పార్టీ మండల అధ్యక్షులు కోట రాములు అందజే శారు.ఈసందర్బంగా కోటరాములు గారు మాట్లాడుతూ పార్టీ సీనియర్ కార్యకర్త దండు చంద్రయ్య కుటుంబానికి ఆదుకోవాలనే సంకల్పంతో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి గతంలో ఇంటి నిర్మాణం కోసం లక్ష రూపాయలను అందజేసినట్లు ఆయన గుర్తు చేశారు.దండు చంద్రయ్య కుటుంబం ఇంటి నిర్మాణం పూర్తి చేసుకొని గురువారం గృహప్రవేశం సందర్బంగా వారి ఇంటికి వెళ్లి కార్యక్రమంలో పాల్గొని మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు కలిసి రూ. 35 వేలు జమ చేసి వారి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఆపదలో ఉండే కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రవీందర్ రెడ్డి, రఘు వర్ధన్ గౌడ్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ రాము, నాయకులు శివశంకర్ గౌడ్ మండల ఆల యువసేన నాయకులు అనిల్ గౌడ్, అశోక్ కుమార్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంపీడీవోకు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకుల వినతి



వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**నారాయణపేట , ఆగస్టు 21 ప్రభాతవార్త :** పారిశుద్ధ్య పనుల కోసం స్థానిక సంస్థలకు తక్షణమే నిధులు మంజూరు చేసి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం ఎంపీడీవో సుదర్శన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణాలు మరియు గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు అత్యంత అధ్వాన్నంగా ఉన్న యన్నారు. ఫలితంగా మురికి కాలువలు దుర్వాసనతో నిండిపోయి దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయా వన్నారు. ఈ అపరిశుభ్ర వాతావరణం, దోమల బెడద వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలనుఎదుర్కొంటున్నారు. డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని చోట్ల ఈ వ్యాధుల కారణంగా ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా చోటు చేసుకున్నాయి.ఈ తీవ్రమైన సమస్యపట్ల అధికారులు, ప్రభుత్వం నిరక్ష ్యంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోంది. కావున ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు పారిశుద్ధ్య పనుల కోసం అవసరమైన నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు బి.యాదగిరి, బి నరసింహ, డివిజన్ నాయకులు ప్రశాంత్ టౌన్ కార్యదర్శి కెంచ నారాయణ లాలు ప్రసాద్, వై.సాయిలు, కృష్ణ ,అంజి తోపాటు తదితరులు ఉన్నారు.

## వినాయక మండపాల దగ్గర డీజేలకు అనుమతి లేదు



హాజరైన ఉత్సవ కమిటీ పెద్దలు వివిధ గ్రామల యువకులు, గణేష్ ఉత్సవ ఆర్గనైజర్స్

మాట్లాడుతున్న డీఎస్పీ లింగయ్య

**మద్దూర్,ఆగస్టు21 ప్రభాతవార్త:** గణేష్ ఉత్సవాలు, ఇతర మత పరమైన పండగల సందర్భంగా డీజేలకు అనుమతి లేదని డీఎస్పీ నల్లపు లింగయ్య ఉత్సవ కమిటీ సభ్యులకు తెలిపారు. గురువారం కోస్గి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో కోస్గి, మద్దూరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు, హిందూ మత పెద్దలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి డీఎస్పీ నల్లపు లింగయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ కోస్గి,మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అధికశబ్దం వచ్చే డీజేసౌండ్ సిస్టంల వల్ల పెద్దవారికి ముఖ్యంగా వృద్ధులు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులు, విద్యార్థులు, చిన్న పిల్లలకు, ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి హానికరం కావడంతోపాటు శబ్ద కాలుష్య చట్టాల ఉల్లంఘన మరియు ఉత్సవాలను సాంప్రదాయంగా నిర్వహించుకోవడానికి డీజే లను నిషేధిస్తున్నట్టు జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు డీఎస్పీ తెలిపారు. రాబోయే గణేష్ ఉత్సవాల సందర్భంగా మరియు ఇతర మతపరమైన పండుగలకు డీజేలకు అనుమతి లేదని ముందస్తు డీజేలను ఎవరు బుక్ చేసుకోరాదని, ఒక వేళ డీజే లను ఎవరైనా పెడితే సీజ్ చేసి మండపం యొక్క ఆర్గనైజర్స్ పై కేసు నమోదు చేసి, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఎస్పీ హెచ్చరించారు. ఉత్సవాలలో డీజేలకు బదులుగా చిన్న సౌండ్ బాక్సులను, షేర్ బ్యాండ్ తో పండుగలను సాంప్రదాయ బద్ధంగా జరుపుకునే విధంగా ప్రజలు ఉత్సవల కమిటీ ఆర్గనైజర్స్ యువతకు దిశ నిర్దేశం చేయాలని అలాగే జిల్లా పోలీస్ శాఖకు సహకరించాలని, రాష్ట్రంలో నారాయణపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని డిఎస్పీ కోరారు. వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే దండం చెరువు పరిశీలించిన డీఎస్పీడీఎస్పీ నల్లపు లింగయ్య, కోస్గి సర్కిల్ పోలీస్ అధికారులు మరియు మున్సిపల్, విద్యుత్ అధికారులు తదితరులు గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసే దండం చెరువును ముందస్తు పరిశీలించి అక్కడ విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో తీసుకోవాల్సిన చర్యల గురించి, ప్రజల సౌకర్యార్థం ముందస్తు ఎలాంటి పనులను చెయ్యాలని నోట్ చేసుకొని త్వరలో ఆ పనులను సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి పూర్తి చేయాలని డిఎస్పి సూచించారు. ఈ కార్యక్రమంలో కోస్గి, సీఐ సైదులు, ఎస్సైలు బాలరాజు, మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్, ఎస్సై 2 ఆంజనేయులు, ఉత్సవ కమిటీ పెద్దలు వివిధ గ్రామల యువకులు, గణేష్ ఉత్సవ ఆర్గనైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న యూరియా కష్టాలు...

### సరఫరా లేదంటూ కార్యాలయం ఎదుట నోటీసు బోర్డు



ఆత్మకూరులోని పిఎసిఎస్ కార్యాలయం ముందు నోటీసు బోర్డు తగిలించిన దృశ్యం

**ఆత్మకూర్ ఆగస్టు 21, ప్రభాతవార్త ;** ఒవైపు రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్న నేపథ్యంలో ఆత్మకూర్ సబ్ డివిజన్ పరిధిలోని రైతాంగం సైతం యూరియా దొరకక నానా అవస్థలు పడుతున్నారు. ఓవైపు ఉమ్మడి జిల్లాలో యూరియా కొరత లేదంటూ మహబూబ్నగర్ ఉమ్మడి జిల్లా డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి పత్రికా ప్రకటనలు గుప్పించినప్పటికీ ఆత్మకూరు ఏరియాలో మాత్రం యూరియా దొరకకపోవడం పట్ల రైతులు తీవ్ర విమర్శల వర్షం గుప్పిస్తున్నారు. రాష్ట్రానికి 164 టన్నుల మెట్రిక్ యూరియా మాత్రమే అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని 105 సొసైటీ కేంద్రాలకు మరియు ప్రైవేటు ఎరువుల డీలర్లకు 60 మరియు 40 శాతం చొప్పున యూరియా సరఫరా ప్రభుత్వం చేసిందని వెంటనే రైతులకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లుగా ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి ప్రకటించినప్పటికీ ఆచరణలో మాత్రం ఏ మాత్రం యూరియా సరఫరా చేయకపోవడం విశేషం. ఆత్మకూర్ మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ మరియు రామన్పాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఆయకట్టు రైతులు పెద్ద ఎత్తున ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో వరి నాట్లు పూర్తయిన రోజులు కావస్తున్నప్పటికీ కనీసం ఎకరాకు రెండు బస్తాల యూరియా కూడా సరఫరా చేయడం లేదంటూ కట్టకింది గ్రామాలకు చెందిన కత్తేపల్లి, తూంపల్లి, రేచింతల, వీరరాఘవపురం తదితర గ్రామాలకు చెందిన రైతులు ఆక్రోషం వెళ్లకక్కుతున్నారు. గురువారం ఉదయమే ఆత్మకూరులోని సింగిల్ విండో కార్యాలయానికి రైతులు యూరియా సరఫరా చేయాలంటూ పెద్ద ఎత్తున తరలిరావడంతో దిక్కుతోచని అధికారులు ఈరోజు సహకార సంఘం పరిధిలో యూరియా సరఫరా చేయడం లేదంటూ కార్యాలయానికి నోటీసు బోర్డు తగిలించడంతో రైతులు చూసి అవాక్కైపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు గానీ ప్రజా ప్రతినిధులు కానీ తక్షణమే స్పందించి రైతులకు యూరియా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో వరి పైరు దిగుబడి తగ్గడమే కాకుండా ఆర్థిక కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందంటూ పలు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## గ్రామాలలో పారిశుద్ధ పనులు చేపట్టాలి

### సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కు వినతి పత్రం


అమరచింత మండలంలోని గ్రామాలలో పారిశుద్ధ పనులు చేపట్టాలని తహసిల్దార్ కు వినతి పత్రం

**అమరచింత ఆగస్టు 21, ప్రభాతవార్త:** గ్రామాలలో పారిశుద్ధ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో గురువారం తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ అమరచింత మండల కార్యదర్శి కే రాజన్న మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలు జరపకపోవడం వల్ల గ్రామాలలో పారిశుద్ధ పనులు చేపట్టడం లేదని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి పారిశుద్ధ పనులను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల పారిశుద్ధ పనులు నిలిచిపోయాయని గ్రామాల ప్రజలు విష జ్వరాలతో బాధపడుతున్నారని వెంటనే అధికారులు గ్రామాలలో పారిశుద్ధ పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే మురుగు కాలువలు నిండిపోవడం వల్ల దోమలు విపరీతంగా పెరిగాయని వెంటనే అధికారులు మురుగు కాలువలలో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు గ్రామాలలో పారిశుద్ధ పనులు చేపట్టకపోతే సిపిఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎంఎల్ మాస్ లైన్ డివిజన్ నాయకులు, రాజు, మురళి, మన్యం, రామచందర్, సత్తన్న, అయ్యప్ప, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి


ఎంపీడీవో ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

**ఆత్మకూర్ ఆగస్టు 21, ప్రభాతవార్త :** ప్రస్తుత వర్షాకాల సీజన్లో గత వారం రోజులుగా ఆత్మకూర్ సబ్ డివిజన్ పరిధిలో ముసురువర్షాల మూలంగా ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందని తక్షణమే అధికారులు స్పందించి అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం రోజు ఆత్మకూరులోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ప్రసాద్కు ఆ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో గత రెండు సంవత్సరాలుగా అటు సర్పంచులు లేక ఇటు ప్రభుత్వ పంచాయతీ కార్యదర్శులు పెట్టుబడులు పెట్టలేక ఎక్కడి పాలన అక్కడే పరకేసిందని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో అటాధికారులు ఇటు ప్రజాప్రతినిధులు ఏమాత్రం చర్యలు చేపట్టకపోవడం వలన ప్రజలు సతమతమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా కురుస్తున్న ముసలి వర్షాలకు సబ్ డివిజన్ పరిధిలోని ఏ గ్రామంలో చూసినా మురికినీరు చేరి ప్రజలు అంటువ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయని అధికారులు తక్షణమే స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గోవిందు,,భగవంతు రాములు తదితరులతో పాటుగా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లా పరిషత్ పీఠాన్ని కైవసం చేసుకుంటాం

### జిల్లా అభివృద్ధిలో కంకణబద్దులం అవుతాం

### బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్

### డా. రాచాల యుగంధర్ గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న రాచాల యుగంధర్ గౌడ్

**వనపర్తి, ఆగస్టు 21 ప్రభాతవార్త:** త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి...ప్రజల ఆశీర్వాదంతో వనపర్తి జిల్లా పరిషత్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డా. రాచాల యుగంధర్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీ పొలిటికల్ జేఏసీని స్థాపించి.. ఓ వైపు బీసీల హక్కుల కోసం పోరాడుతూనే ఈ ప్రాంత బిడ్డగా.. ఇక్కడ జరుగుతున్న అవినీతిని.. అధికారులు, ప్రజాప్రతినిధుల అలసత్వాన్ని ఎండగడుతున్నానన్నారు.రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా కల్పించేందుకు అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపినా ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ పరిధిలో ఉన్న నామినేటెడ్ మరియు ఇతర పదవులలో బీసీలకు 42 శాతం కేటాయించాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ పొలిటికల్ జేఏసీ తమ అభ్యర్థులను నిలబెట్టి..గెలిపించుకుని జిల్లాలోని సమస్యలను పరిష్కరిస్తామన్నారు.బీసీలు పార్టీల వారీగా విడిపోకూడదని, ఖచ్చితంగా గెలిచేలా వ్యూహాత్మక ఎత్తుగడలు ఫాలో కావాలని వివరించారు.ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీసీల మధ్య చిచ్చు పెట్టేందుకు కొందరు నాయకులు కుట్రలు చేస్తుంటారని, వీటిపై అప్ర మత్తంగా ఉండాలని సూచించారు.రాజ్యాధికారానికి మూలం స్థానిక సంస్థలని, వాటిని చేజిక్కించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ప్రజల కోసం పనిచేసే వారిని ప్రజలే గెలిపిస్తారని, ప్రజల సమస్యలపై స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల కోసం పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు అరవిందా చారి, ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షులు రాఘవేందర్ గౌడ్, కొత్తకోట మండల అద్యక్షులు అంజన్న యాదవ్ ,జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, శ్రీరంగాపూర్ మండల అద్యక్షుడు ధర్మేంద్ర సాగర్, ప్రధాన కార్యదర్శి అస్కని రమేష్, మదనాపూర్ మండల కన్వీనర్ నరసింహ యాదవ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బందుకు వ్యాపారస్తులు సహకరించాలి


మాట్లాడుతున్న వ్యాపార సంఘం నాయకులు

**మద్దూర్, ఆగస్టు 21 ప్రభాతవార్త :** మద్దూరు మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో నేడు ఓ ఈ జెఎసి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పిలుపుమేరకు బందుకు మద్దూరు మండల వ్యాపారస్తులు సహకరించాలని మద్దూరు వ్యాపార సంఘం నాయకులు గురువారం రోజు మద్దూర్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నారు. తెలంగాణలో మార్వాడి అరాచకం ఎక్కువ కావడంతో వలన ఊరుకునే స్థాయిలో ఎవరు లేరని సందర్భంగా వారన్నారు. ఉదయం 10 గంటలకు ర్యాలీతోని మొదలు కొని పాత బస్టాండ్ దగ్గర కర్ణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని సంఘం నాయకులు నందుచారి, ప్రశాంత్ పటేల్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

## 38వ రోజుకు చేరిన రిలే దీక్షలు


38వ రోజు రైతుల రిలే దీక్షలు

**నారాయణపేట, ఆగస్టు 21 ప్రభాతవార్త :** మక్తల్, నారాయణపేట, కోడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద చేపట్టిన రిలే దీక్షలు గురువారంతో 38వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా భూ నిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్రామారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గోపాల్ తో బాటు పలువురు మాట్లాడుతూ పథకంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం ఎకరానికి 14 లక్షల రూపాయలు అందజేస్తామని చెప్పడం జరుగుతుందని బయటి మార్కెట్ రేటుకు అనుగుణంగా రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితుల సంఘం నాయకులు రైతులు తదితరులు ఉన్నారు.

## పిఆర్‌టియు పోస్టర్ విడుదల

**మద్దూర్,ఆగస్టు 21 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూర్ పట్టణ కేంద్రంలో గురువారం పిఆర్‌టియు ఆధ్వర్యంలో ధర్నా చేయుటకు పోస్టర్ విడుదల చేశారు. పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల యొక్క సిపిఎస్ రద్దుచేసి ఓపిసిని పునరుద్ధరించాలని సెప్టెంబర్ ఒకటవ తేదీన లక్ష మంది ఉద్యోగుల ఉపాధ్యాయులతోని హైదరాబాదులో ధర్నా చేయుటకు పోస్టర్ విడుదల చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సూర్య ప్రకాష్ రాష్ట్ర అసోసియేట్స్ అధ్యక్షులు నర్సింహారెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు ఉప్పునుంతలలో పనుల జాతర

**ఉప్పునుంతల, ఆగష్టు 22 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్స వాలు నిర్వహించాలని ఆదేశాల మేరకు రాష్ట్ర పంచాయతీ రాజ్‌గ్రామీణ అభివృద్ధి శాఖ వారి ఆధ్వర్యంలో నేటి నుంచి పనుల జాతర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో రూ.2,199 కోట్ల తో చేపట్టబోయే రెండో విడత పను ల జాతర కార్యక్రమం నేడు ప్రారంభం కానున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి తెలిపారు. మండలం లోని దాసర్లపల్లి గ్రామంలో ఉదయం 9.30 గంటలకు గ్రామ పంచాయతీ భవనానికి భూమి పూజ, కంసానిపల్లి లో ఉదయం 10.00 గంటలకు అంగన్ వాడీ భవనానికి భూమి పూజ, ఉద యం 10.30 గంటలకు లత్తిపూర్ లో అంగన్వాడి భవనానికి శంకుస్థాపన, ఉదయం 11.00 గం.లకు గువ్వలోని పల్లి గ్రా మంలో అంగన్ వాడీ భవనానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు , నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పార్టీ కార్యకర్తలు, అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి పిలుపు నిచ్చారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే ఐఐటి నీట్ వంటి ప్రతిష్టాత్మక పరీక్షలకు ఉచిత శిక్షణ

### ఐఐటి నీట్ ఫౌండేషన్‌ను ప్రారంభించిన జిల్లా విద్యా శాఖ అధికారి అబ్దుల్ ఘని

**వనపర్తి, ఆగస్టు 21 ప్రభాతవార్త:** జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఐఐటి నీట్ ఫౌండేషన్ను జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ గని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఇదే పాఠశాలలో విద్యనభ్యసించి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదగడం గర్వకారణం అన్నారు. జిల్లాలో జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేయడం నాకు ఎంతో గర్వంగా ఉంది" అని పేర్కొన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో చదవలేని, ఆర్థికంగా వెనుకబడిన బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలోనే ఐఐటి, నీట్ వంటి ప్రతిష్టాత్మక పరీక్షలకు ఉచిత శిక్షణ వనరులు లభించడం విశేషం అన్నారు. వేల రూపాయలు ఖర్చు చేయలేని పరిస్థితుల్లో ఉన్న విద్యార్థులకు ఈ అవకాశాలు లభించడం శుభపరిణామం" అని అభిప్రాయపడ్డారు. జిల్లా విద్యాశాఖ అధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురు రాజ్ యాదవ్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురురాజు యాదవ్ స్వయంకృషితో విద్యార్థుల కోసం ఐఐటి మరియు నీట్ ఫౌండేషన్ను అందుబాటులోకి తెచ్చిన విషయం ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదివే విద్యార్థులు కూడా మంచి ఫలితాలు సాధించి తమ ప్రతిభను నిరూపిస్తారని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మద్దిలేటి, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## విద్యార్థులైదుగురు.. ఉపాధ్యాయుడొక్కడు

**-నల్లగుట్టతండా ప్రభుత్వ పీఎస్ పరిస్థితి**



నల్లగుట్టతండా ప్రాథమిక పాఠశాల

**భూత్పూర్, ఆగస్టు 21,ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని ఒకటవ వార్డు నల్లగుట్టతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పాఠశాలలో ఐదుగురే విద్యార్థులున్నారు. వీరికి ఒక ఉపాధ్యాయుడు, ఒక అటెండెంట్, ఓఅంగన్‌వాడీ టీచరు ఉన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వద్ద ఉన్న విద్యాశాఖ ఈ ఏడాది విద్యాసంవత్సరానికి వినూత్నంగా ఒక నెల రోజుల పాటు బడిబాట కార్యక్రమం నిర్వహించేలా ఆదేశాలు జారీ చేసి ఈ ఏడాది విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెరిగే విధంగా చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థుల సంఖ్య బాగానే పెరిగింది. అయితే నల్లగుట తండా ప్రాథమిక పాఠశాల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం కూడా ఐదుగురే విద్యార్థులున్నారు.

**తండాలో బడి ఈడు పిల్లలింతేమంది : పాఠశాల ఏకోపాధ్యాయుడు వహీద్**

తండాలో ఈ ఏడాది బడి ఈడు పిల్లలెవరూ లేరని, ఇదివరకు విద్యార్థులు ఇలాగే కొనసాగుతున్నారని, ఐదుగురిలో ఒకటో తరగతిలో ఒక్కరు, మూడులో ఇద్దరు, నాల్గయిదు తరగతులలో ఇద్దరేసి విద్యార్థులున్నారని, తాము విద్యార్థులను పెంచేందుకు తమ వంతు కృషిచేశామని, తండాలో బడి ఈడు పిల్లలింతేమందని పాఠశాల ఉపాధ్యాయుడు వహీద్ 'ప్రభాతవార్త'తో పేర్కొన్నారు. జిల్లా కేంద్రం హౌసింగ్ బోర్డు దగ్గరలో ఉన్నందున తండాలో ఉన్న పిల్లలు ఇదివరకే ఇతర ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నట్లు తెలిసింది.

## పారిశుద్ధ్య పనుల కోసం నిధులు మంజూరు చేయాలి

**దామరగిద్ద, ఆగస్టు 21 ప్రభాతవార్త :** పారిశుద్ధ్య పనుల కోసం స్థానిక సంస్థలకు తక్షణమే నిధులు మంజూరు చేసి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు పి. తాయప్ప అన్నారు. దామరగిద్ద మండలంలోని, సీపీఐ యంయల్ మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా. దామరగిద్ద ఎంపీడీవోకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా తాయప్ప మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణాలు గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు అత్యంత అధ్వాన్నంగా ఉన్నాయి. ప్రభుత్వ నిధులు అందక పోవడంతో స్థానిక సంస్థలు మురికి కాలువలను శుభ్రం చేయలేకపోతున్నాయి. దీని ఫలితంగా మురికి కాలువలు దుర్వాసనతో నిండిపోయి దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ అపరిశుభ్ర వాతావరణం, దోమల బెడద వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని చోట్ల ఈ వ్యాధుల కారణంగా ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. ఈ తీవ్రమైన సమస్యపట్ల అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోంది. కావున ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు పారిశుద్ధ్య పనుల కోసం అవసరమైన నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రం ను దామరగిద్ద మండల ఎంపీడీవో సాయిలక్ష్మికి ఇవ్వడం జరిగింది. పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు ఎస్. సాయికు మార్, పి.వై.ఎల్ జిల్లా కోశాధికారి పి. మధు, నాయకులు నరసింహ, రాజు, కాసిం తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## పండుగలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలి : ఎస్ఐ

**ఊర్కొండ, ఆగస్టు 21 ప్రభాతవార్త:** పండుగలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్ఐ కృష్ణదేవ అన్నారు. గురువారం ఊర్కొండ మండల పోలీస్‌స్టేషన్‌లో వినాయక చవితి, మిలాద్ -ఉన్-నబి పండుగ వేడుకలపై పలువురు నాయకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణదేవ మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినాల్లో ఎవ్వరికి ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ పిలుపునిచ్చారు. డీజే బాక్స్‌లకు ఎలాంటి అనుమతులు లేవని, వినాయకులను ఏర్పాటు చేసుకునే వారు ముందస్తుగా పోలీస్‌శాఖ అనుమతులు తీసుకోవాలని సూచించారు. వినాయక చవితి, మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఒకే రోజు ఉండటంతో మత సామరస్యాలకు ప్రతీకగా పండగుల నిర్వహించుకోవాలని, పోలీస్ శాఖకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసే సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసేటప్పుడు అన్ని రకాల ఏర్పాట్లను చేసుకొని ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా నిర్వాహకులు బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మ్యాకల శ్రీనివాసులు, రాజయ్య, నాయకులు వహిదొద్దీన్, బ్రాహ్మ చారి, గోపి, మల్లేష్, శ్రీకాంత్, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**దామరగిద్ద, ఆగస్టు 21 ప్రభాతవార్త :** అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర తెలంగాణ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐయుకేఎస్ జిల్లా కోశాధికారి పి.తాయప్ప , పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు ఎస్. సాయికుమార్ అన్నారు. దామరగిద్ద మండలం ఉడ్మల్ గిద్ద గ్రామంలో ఏఐయుకేఎస్ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా రైతులను నిండముంచేస్తున్న పరిస్థితి ఉన్నది. ఈరోజు దేశంలో సోడా కార్పొరేటర్ వ్యాపార సంస్థలు ఒక వస్తువుని కనుగొని ప్రభుత్వ పరిమిషన్ ద్వారా మార్కెట్లో పంపినోడు నిర్వహించిన ధరకే అమ్ముతున్న పరిస్థితి ఉన్నది. దేశానికి అన్నం పెట్టే రైతులు కాయ కష్టం చేసి పంటను పండించి మార్కెట్ కి తీసుకుపోతే ప్రభుత్వం చేతిలో, దళారుల చేతిలో మోసపోతున్న పరిస్థితి ఉన్నది. ఈ తరుణంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం ఏఐయుపిఎఫ్ తెలంగాణ రాష్ట్ర మహాసభలను ఈనెల 25,26 తేదీలలో జిల్లా కేంద్రంలో నిర్వహించుకుంటున్నది. ఈ మహాసభల విజయవంతంపై రైతులు, కూలీలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐయుకేఎస్ నాయకులు రైతులుఆశప్ప, నర్సి రెడ్డి, తమ్మప్ప, దవుల్‌బియా, పెంటప్ప, హనుమంతు, కాసిమ్బియా, చంద్రప్ప, మల్లమ్మ, అనంతయ్య, రాజు కృష్ణ, కాశప్ప, అలితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలి : ఎస్.ఐ. రవి

**ఇటిక్యాల ఆగస్టు 21, ప్రభాతవార్త ;** ఈనెల 27 వ తేదీ వినాయక చవితి పండుగను పురస్కరించుకొని గ్రామాలలో గణేష్ విగ్రహాల మండపాల ఏర్పాటు కోసం అలాగే పోలీస్ భద్రత కోసం పోలీస్ పోర్టల్ లో దరఖాస్తు చేసుకొని అనుమతులు పొందాలని గణేష్ మండపాల నిర్వాహకులకు ఇటిక్యాల ఎస్.ఐ. రవి సూచించారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులకు పలు సూచనలు చేస్తూ గణేష్ విగ్రహ అలా మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అనుకున్న సమయానికి నిమజ్జనం పూర్తి చేసే విధంగా ఉండాలని ఎమర్జెన్సీ వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసుకోవాలని అలాగే మండపాల కమిటీ వివరాలు బాధ్యత వహించే వారి వివరాలు ఫోన్ నంబర్లు మండపాల వద్ద ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించుకోవాలని మండపాలలో శోభాయాత్ర సందర్భంగా ఎట్టి పరిస్థితులలో డీజే ను వాడరాదని అంతేకాక 24 గంటల పాటు ఒక వాలెంటర్ అందుబాటులో ఉండాలని అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు అందుబాటులో నీటిని సిద్ధంగా ఉంచుకోవాలని మద్యం సేవించడం. పేకాట ఆడటం అసభ్యకరమైన నృ త్యాలు చేయరాదని అన్యమతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు పాటలు నిషేధమని అలాగే విగ్రహ మండపాల వద్ద పోలీస్ పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో సంతకం చేస్తారని కొత్త వ్యక్తులు కనిపిస్తే 100 డయల్ కు సమాచారం స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సామాజిక మాధ్యమాలలో వచ్చే ఎలాంటి వదంతులు నమ్మరాదని వినాయక చవితిని మండల ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ముత్యాల ఎస్.ఐ. కే. రవి మండల ప్రజలను కోరారు.

## గణేష్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

**లౌడ్ స్పీకర్స్, డిజెలకు అనుమతి లేదు**

**బిజినపల్లి, ఆగస్టు 21 ప్రభాతవార్త:** పోలీసు నిబంధనలు పాటిస్తూ భక్తి శ్రద్ధలతో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి అని ఎస్ఐ కె.శ్రీనివాస్ సూచించారు. మండపాల నిర్వహకులు గణపతి కమిటీ సభ్యులతో గురువారం పోలీస్ స్టేషన్ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటుకు ఆన్లైన్ ద్వారా సమాచారం అందించాలని నిబంధనలకు లోబడి నడుచుకోవాలని ,పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులను ప్రతిష్టించండి అని సూచించారు. ఎట్టి పరిస్థితులలోనూ పెద్ద శబ్దాలతో కూడిన లౌడ్ స్పీకర్స్, డి.జె. లకు అనుమతి లేదని అన్నారు. ఎవరైన డి.జె. ఏర్పాటు చేస్తే మండప నిర్వాహకులపై, డి.జె యాజమానులపై చట్ట రిత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అన్నారు. గణేష్ మండప నిర్వాహకులు విద్యుత్ సరఫరాకై విద్యుత్ శాఖ నుండి ఖచ్చితంగా అనుమతి తీసుకోవాలి, భారీ వర్షాల నేపథ్యంలో మండపాల వద్ద షార్ట్ సర్క్యూట్ జరగకుండా జాగ్రత్తలు తీసుకొని, నాణ్యతతో కూడిన మండప నిర్మాణం చేపట్టాలన్నారు. మండపాల వద్ద మైకులు, స్పీకర్లను తక్కువ సౌండ్ తో, రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలి అన్నారు. రాత్రి సమయంలో తనిఖీ చేయడానికి వచ్చే పోలీస్ అధికారికి మంటప వలంటీర్లు సహకరించాలన్నారు. అత్యవసర సమయంలో, ఏదైనా సమాచారం ఉన్నా డయల్ 100 కు గాని, పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలన్నారు. గణేష్ మండపాలను జాగ్రత్తగా చూసుకొనుటకు రాత్రి సమయం లో కనీసం ఇద్దరు లేదా ముగ్గురు వాలంటీర్లు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. విగ్రహం ప్రతిష్టించే రోజు, నిమజ్జనం చేసే తేదీ సమయం ముందస్తుగా పోలీస్ సిబ్బందికి తెలియజేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల లో వినాయక మండపాలను ఏర్పాటు చేసే మండప యజమానులు రహదారులపై, ప్రజలు తిరిగే రోడ్లపై ప్రతిష్టించ రాదని. ఎట్టి పరిస్థితులలోను జనజీవనానికి అంతరాయం కలిగించవద్దన్నారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది చిన్ని నాయక్ జితేందర్ సురేందర్ కల్పన అనసూయ మోనిక రియానా బేగం తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పించాలి



గ్రంథాలయంలో అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కలెక్టర్

**గద్వాల టౌన్ ఆగస్టు 21, ప్రభాత వార్త:** జిల్లా గ్రంథాలయానికి అవసరమైన సౌకర్యాలు కల్పించి పాఠ్య పుస్తకాలను, మరుగుదొడ్లు సమకూర్చాలనీ జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలో లైబ్రరీ రూములు, విద్యార్థుల అవసరమైన సౌకర్యాలు, గ్రంథాలయ పుస్తకాలను సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారు చదువుతున్న విధానం, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మరుగుదొడ్ల ప్రధాన సమస్యగా పేర్కొన్న వెంటనే కలెక్టర్ వెంటనే స్పందించి ఇంజనీరింగ్ అధికారులకు మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. లైబ్రరీలో ఎదుర్కొంటున్న మిగతా సమస్యల పూర్తి జాబితాను సిద్ధం చేసి సమర్పించాలని కలెక్టర్ సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. లైబ్రరీలో నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లను విద్యార్థులు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త లైబ్రరీ భవనం త్వరలో నిర్మాణం ప్రారంభమై, మరింత ఆధునిక, సౌకర్యవంతమైన లైబ్రరీ విద్యార్థులకు అందుబాటులో ఉండబోతుందని ఆయన తెలిపారు. కొత్త లైబ్రరీ భవన నిర్మాణాన్ని పరిశీలించి వివరాలను మున్సిపల్ కమిషనర్ తో అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ జమ్మిచేడులోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. నిర్మాణాలు చేపట్టిన బిల్లుల చెల్లింపులు సక్రమంగా అందుతున్నాయా అని లబ్ధిదారున్ని అడిగి తెలుసుకున్నారు. మొదటి విడతగా మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలని లబ్ధిదారునికి సూచించారు. లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందే విధంగా మున్సిపల్ కమిషనర్లకు లాగిన్ ఐడీ ఇవ్వాలని ఏ.డి మైన్స్ కి ఆదేశించారు. లబ్ధిదారులకు ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తామని కలెక్టర్ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ దశరథ్, లైబ్రేరియన్ రామాంజనేయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు బడిలో అల్పాహారం

**- ఆదర్శనంగా నిలుస్తున్న ఉపాధ్యాయులు...**



అల్పాహారం ప్రారంభిస్తున్న దృశ్యం

**వంగూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయిస్తున్న తరుణంలో ఉపాధ్యాయుడు తాను పనిచేస్తున్న సర్కారు బడిలోనే తన ఇద్దరు పిల్లలను చేర్పించి విద్యాబుద్ధులు అందించడంతో పాటు సెమి రెసిడెన్షియల్ పాఠశాల మాదిరిగా తాను పని చేస్తున్న పాఠశాలలో విద్యార్థులకు ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్ అందించేందుకు శ్రీకారం చుట్టి ఆఉపాధ్యాయుడు ఆదర్శంగా నిలుస్తున్నారు. వంగూరు మండలం తుమ్మలపల్లి గ్రామంలోని యుపిఎస్ పాఠశాలలో విద్యాబుద్దులు నేర్చుకుంటున్న పేదింటి విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. హార్ట్ ఫుల్ నెస్ కన్హా శాంతి వనం డాక్టర్ నిహారిక బృందం ఆధ్వర్యంలో తుమ్మలపల్లి యుపిఎస్ పాఠశాలలో అల్పాహారం, స్నాక్స్ కార్యక్రమాన్ని మండల తహసిల్దార్ మురళీమోహన్, ఎంపీడీఓ బ్రహ్మచారి, మండల విద్యాశాఖ అధికారి మురళి మనోహరా చారి, మాజీ సర్పంచ్ చిమ్ముల అల్వాల్ రెడ్డిలు గురువారం ప్రారంభించారు. తుమ్మలపల్లి పాఠశాలలో నూతనంగా విధులు చేపట్టిన ఉపాధ్యాయులు కోటేశ్వరరావు వారి కుమారులను తాను పనిచేసే పాఠశాలలోనే చదివిస్తున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో కోటేశ్వరరావు గారి కుమారుడు కట్టా రిక్కీ తేజ్ గేసిన బొమ్మల ఆర్ట్ గ్యాలరిని కన్హా శాంతివనం వారు చూసి ప్రశాంశించారు. తుమ్మలపల్లి ఉపాధ్యాయుల కోరిక మేరకు హార్ట్ ఫుల్ నెస్ కన్హా శాంతివనం ఆశ్రమం వారు అల్పాహారం, స్నాక్స్ ను ఈ విద్యా సంవత్సరం విద్యార్థులకు అందించేందుకు ముందుకు వచ్చి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో చిరంజీవి కట్టా రిక్కీ తేజ్ 7 గేసిన ఆర్ట్ గ్యాలారిని ప్రదర్శించారు. చిన్నారి గేసిన ఈ చిత్రాలు అందరిని మంత్ర ముగ్దులను చేశాయి. ఈ కార్యక్రమంలో రంగాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు డిండి చింతపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నయ్య, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల వంగూరు ఉపాధ్యాయులు లింగమయ్య, రంగాపూర్ ఉపాధ్యాయులు మల్లయ్య, సిఆర్‌పిలు వేదమూర్తి, లక్ష్మణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సైదులు, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, సునిత, కవిత, మమత గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆగస్టు 23న వనపర్తి జిల్లాలో సమాచార కమిషనర్ల పర్యటన

**ఐడిఒసిలో సమాచార హక్కు చట్టం 2005కు సంబంధించిన పెండింగ్ అప్పీళ్ల పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్ విజయేంద్ర బోయి**

**వనపర్తి, ఆగస్టు 21 ప్రభాతవార్త:** ఆగస్టు 23న వనపర్తి జిల్లాకు నలుగురు రాష్ట్ర సమాచార కమిషనర్లు విచ్చేయనున్నట్లు జిల్లా ఇంచార్జి కలెక్టర్ విజయేంద్ర బోయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా సమాచార కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ల పోస్టులు ఖాళీ ఉండటంతో సమాచార హక్కు చట్టం 2005 ద్వారా దరఖాస్తులు చేసుకున్న అప్పీళ్లు అనేకం పెండింగ్‌లో ఉండిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం వచ్చాక సమాచార కమిషనర్లను నియమించడంతో పెండింగ్ లో ఉన్న అప్పీళ్లను పరిష్కరించేందుకు మార్గం సుగమమయ్యాయి. ఇందులో భాగంగానే సమాచార కమిషనర్లు వైష్ణవి మెర్ల, పి.వి. శ్రీనివాస రావు, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్య రెడ్డి ఆగస్టు 22న జోగులాంబ గద్వాల జిల్లాలో పర్యటించి సమాచార హక్కు చట్టం 2005 ద్వారా పెండింగ్ లో ఉన్న అప్పీళ్లను పరిష్కరిస్తారు. ఆగస్టు 23న సమాచార కమిషనర్లు వనపర్తి జిల్లాకు చేరుకొని ఉదయం 11.30 గంటలకు సమీకృత కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో జిల్లాలోని పౌర సమాచార అధికారులు, అప్పీలేట్ అధికారులకు సమాచార హక్కు చట్టం పై అవగాహన కల్పిస్తారు. అనంతరం పెండింగ్ అప్పీళ్లపై సమీక్ష నిర్వహిస్తారు. వనపర్తి జిల్లాకు సంబంధించిన దాదాపు 90 పెండింగ్ అప్పీళ్లను పరిశీలించి పరిష్కరిస్తారని తెలియజేశారు. కావున జిల్లాలోని ప్రజలు సమాచార హక్కు చట్టం కు సంబంధించిన తమ ఫిర్యాదులు ఉంటే కమిషనర్ల ముందు హాజరై తమ ఫిర్యాదులు పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు.

## పేదల సంక్షేమమే లయన్స్ క్లబ్ ధ్యేయం : ఎమ్మెల్యే డా.పర్ణిక రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి

**నారాయణపేట , ఆగస్టు 21 ప్రభాతవార్త :** ఉమ్మడి రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి జన్మదినం సందర్భంగా లయన్స్ క్లబ్ అఫ్ నారాయణ్ పేట్ ఆధ్వర్యంలో గురువారం సివి ఆర్ భవనంలో విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణి చిల్డ్రన్స్ హాస్పిటల్ లో మున్సిపల్ కార్మికులకు దుప్పట్ల పంపిణి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణి తో బాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయి హాస్పిటల్‌లో ఉచిత షుగర్ చిన్న పిల్లలమెగా వైద్యశిబిరంతోపాటు వెంకటేశ్వర కంటి హాస్పిటల్ ఉచిత కంటి వైద్యశిబిరం, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలను ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకు లయన్స్ క్లబ్ ఒసైనికునిలా పనిచేస్తుందని లయన్స్ సేవాలు అభినందనీయమని లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు సరిత హరి నారాయణ్ బట్టడ్ తో పాటు సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ హరి నారాయణ్ బట్టడ్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చిట్టెం అభిజయ్ రెడ్డి, మార్కెట్ చేర్మెన్ సదాశివారెడ్డి, వైస్ చేర్మెన్ కొనంగేరి హన్మంతు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సలీం, మాజీ మార్కెట్ చేర్మెన్ బండి వేణుగోపాల్, లయన్స్ క్లబ్ కార్యదర్శి సాయినాథ్, కోశాధికారి రాధ, సదానంద్ చారి, గందె ఉమాకాంత్ శ్రీనివాస్ లాహోటి రవిగౌడ్ తో బాటు తదితరులు ఉన్నారు.

## మంచి నడవడికతో సమాజంలో గౌరవం పొందాలి

**రౌడీ షీటర్లలో మార్పు రావాలి**

**జీవితంలో తప్పులను సరిదిద్దుకొని సమాజానికి మేలు చేయాలి**

**రానున్న స్థానిక సంస్థలు ఎన్నికలు,**

**పండగల సందర్భంగా రౌడీషీటర్ల పై స్పెషల్ ఫోకస్**

**జిల్లాలో ఉన్న 106 మంది రౌడీ షీటర్లకు,**

**అవగాహన కార్యక్రమం నిర్వహించిన ఎస్పీ**



రౌడీ షీటర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ

**వనపర్తి, ఆగస్టు 21 ప్రభాతవార్త:** రౌడీయిజం చేస్తూ డబ్బులు వసూలు చేయడం, పదే పదే ప్రజలను భయభ్రాంతులను గురి చేస్తున్న రౌడీలు సమాజంలో మంచి నడవడికతో జీవిస్తూ అందరి ఆదరణ గౌరవాన్ని పొంది రౌడీ షీటర్లలో మార్పు రావాలనీ జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ భవనంలో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలోని నేర చరిత్ర కలిగిన 106 మంది రౌడీషీటర్లతో జిల్లా ఎస్పీ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకొని మంచి నడవడికతో బ్రతకాలని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నేరస్థులు చట్టం నుండి తప్పించుకోవడం అసాధ్యం అని నేరస్థులు తమ అకృత్యాలు పునరావృతం కాకుండా సరైన మార్గదర్శకత్వంతో వారి ఆలోచనా విధానంలో మార్పు తీసుకురావడానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుంది అని మొండిగా ఉండి, తమ పాత



సమావేశానికి హాజరైన జిల్లా పోలీసులు

పద్ధతులను వదులుకోని వారి మీద అదేవిధంగా మళ్ళీ నేరాలు చేసే వారిపై ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్ (పిడి యాక్ట్) నమోదు చేస్తామని హెచ్చరించారు. నేరం చేసే ముందు, మీరు మీ కుటుంబాలు, పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించాలి, షీటర్లు మంచిగా మారి ఎలాంటి నేరాలు చేయకుండా సమాజాభివృద్ధికి దోహదా పడినట్లయితే, వారి సీట్లు తొలగించడానికి తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. భవిష్యత్తులో నేర చరిత్ర ఉన్నా వ్యక్తులు ఎలాంటి నేరాలకు పాల్పడకుండాతమ కుటుంబ సభ్యులతో ప్రశాంతవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు . అలాగే ఏదైనా ,ఎక్కడైనా నేరం జరిగితే పోలీసులకు సమాచారాన్ని అందించే భాధ్యాతయుతమైన పౌరులుగా వుంటూ పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని అన్నారు ముఖ్యంగా హింసతో ఏది సాధించలేమని, ప్రతికార చర్యలతో కాకుండా పరస్పరం చర్చించుకోని సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు. అదేవిధంగా రానున్న పండుగల సందర్భంగా జిల్లా పరిధిలో ఎలాంటి మతపరమైన గొడవలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వరరావు, డిసిఆర్బి డిఎస్పీ, ఉమామహేశ్వరరావు, డిసిఆర్బి ఎస్సై, తిరుపతి రెడ్డి, జిల్లాలో అన్ని పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు పోలీసు సిబ్బంది రౌడీషీటర్స్, తదితరులు పాల్గొన్నారు.

## గడువులోగా బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాలి

**అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కీమ్యా నాయక్**



మేహరూన్, మల్లికార్జున రైస్ మిల్లులను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

**వనపర్తి, ఆగస్టు 21 ప్రభాతవార్త:** ఖరీఫ్ 2024,25 సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) డెలివరీలను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ కీమ్యా నాయక్ ఆదేశించారు. గురువారం పానగల్ మండలంలోని మేహరూన్, మల్లికార్జున రైస్ మిల్లులను ఆయన తనిఖీ చేసి, ధాన్యం నిల్వలు, ప్రాసెసింగ్ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని నిర్ణీత గడువులోగా మిల్లింగ్ చేసి, బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని సూచించారు. డెలివరీలో జాప్యం జరిగితే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. రైస్ మిల్లు యజమానులు సహకరించి, త్వరగా బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థకు అందించాలని కోరారు. పౌరసరఫరాల శాఖ డీఎం జగన్ మోహన్, డీసీఎస్ఓ కాశీ విశ్వనాథ్, తహసీల్దార్ సత్యనారాయణ రెడ్డి, తదితరులు అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ప్రతి ఒక్కరు భక్తి భావం కలిగి ఉండాలి...

**శివాలయం వద్ద మండపం నిర్మాణానికి 3 లక్షల 116 విరాళం**

**కల్వకుర్తి, ఆగస్టు 21 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు భక్తి భావం కలిగి ఉండాలని దాత గోళి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అధ్యాత్మిక చింతనతో సన్మార్గంలో ప్రయాణించడానికి వీలవుతుందన్నారు. కల్వకుర్తి మండలంలోని తాండ్ర గ్రామంలో గురువారం పురాతనమైన శివాలయ మండప నిర్మాణానికి గ్రామ పెద్దలు కె. సుధాకర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మండప నిర్మాణానికి గోళిసుదర్శన్ రెడ్డి రూ.3,01,116ల విరాళం ప్రకటించారు. గ్రామస్తుల సహకారంతో మండప నిర్మాణము చేపడుతామని శ్రీనివాస్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా దాత గోళి సుదర్శన రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దైవ కార్యక్రమంలో తమ సహకారం అందించి దేవాలయాలాభివృద్ధికి చేయాలని కోరారు. మండప నిర్మాణానికి దాతలు ముందుకొచ్చి ఆలయాభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, గ్రామస్తులు జగన్ మోహన్ రెడ్డి, జైపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, బుచ్చి రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, రఘుమారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కుమ్మరి హనుమంతు, కిష్టయ్య యాదవ్, సర్వేశ్వరు గౌడ్, బాల జంగయ్య, ఆంజనేయులు, లింగం సాయిలు, హరీష్ యాదవ్, శివ, భాను తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు మొదటి విడత చెక్కు పంపిణీ

**ధన్వాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త :** ధన్వాడ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడత లక్ష రూపాయలు చెక్కును లబ్ధిదారులకు అందించడం జరిగింది. కార్యక్రమంలో నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి, డిసిసి మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి, పీసీసీ సభ్యుడు చిట్టెం అభిజయ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, చిట్టెం మాధవరెడ్డి, నరహరి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తండ్రి విగ్రహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే

**నారాయణపేట్, ఆగస్టు 21 ప్రభాతవార్త :** నారాయణపేట శాసన సభ్యురాలు ఎమ్మెల్యే డా. పర్ణిక రెడ్డి తండ్రి స్వర్గీయ చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి జయంతి సందర్భంగా గురువారం నారాయణపేట కొత్త గంజ్ వద్ద వెంకటేశ్వర రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి, పీసీసీ సభ్యుడు చిట్టెం అభిజయ్ రెడ్డిలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## సిజినల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**వెల్దండ, ఆగస్టు 21 ప్రభాతవార్త:** వర్షాకాలం దృష్ట్య సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న ఈ కాలంలో ప్రజలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రవికుమార్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వైద్యులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు అత్యవసర మందులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, గ్రామీణ ప్రజలకు భరోసా కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్, పర్యవేక్షణ అధికారి మురళి, ఫార్మసీ అనిత, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, యుడిసి శోభ ఏఎన్ఎం సూర్యకళ, ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పేట మున్సిపల్ కమిషనర్‌గా నర్సయ్య

**నారాయణపేట , ఆగస్టు 21 ప్రభాతవార్త :** నారాయణ పేట మునిసిపల్ కమిషనర్‌గా గురువారం జీ.నర్సయ్య విధుల్లో చేరడం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషనల్ కలెక్టర్, ఎమ్మెల్యే డా. పర్ణిక రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్కను అందజేశారు.

## జిహెచ్ఎం వెంకటమ్మ, సోమేశ్వర్ రెడ్డిలను అభినందించిన డీఈవో

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 21 ప్రభాతవార్త :** కె. వెంకటమ్మ జిహెచ్ఎం ఫతేపూర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ అభినందించారు. బోధనభ్యాసనంలో ఎస్ఇఆర్‌టి విడుదల చేసిన విద్యా రంగంలో మీరు చూపించిన ట్రయల్ బ్రేజర్స్ (మార్గదర్శకులు) అనే పుస్తకంలో బోధనభ్యసన ప్రక్రియను మెరుగుపరచడంలో మీ సృజనాత్మక ఆలోచనలు, అంకితభావం మరియు కృషి విద్యార్థులపై మంచి ప్రభావాన్ని చూపడమే కాక, ఉపాధ్యాయులకు కూడా ప్రేరణగా నిలిచాయి. రాబోయే రోజుల్లో మీ ప్రయాణం మరింత మంది ఉపాధ్యాయులను, విద్యార్థులను ప్రేరేపించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ అభినందించారు. అదేవిధంగా పాఠశాల స్థాయిలో చాలామంది ఉపాధ్యాయులు ఈ రకంగా వినూత్న బోధనలు చేస్తున్నారని వారందరూ కూడా ఎస్‌సిఆర్‌టి వెబ్‌సైట్‌లో తమ తమ బోధనా పద్ధతులను నమోదు చేసుకోవాలని ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.

## మహబూబ్‌నగర్ అభివృద్ధికి సహకరించండి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

పట్టణాలు అభివృద్ధి చెందితే యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని, విరి విరిగా అనేక కంపెనీలు వస్తాయని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం క్లస్టర్ అభివృద్ధికి సంబంధించిన నివేదిక పంపించింది కాబట్టి, ముందు గా మహబూబ్‌నగర్ క్లస్టర్‌కు ప్రాధాన్యత ఇచ్చి, ఎంపిక చేయాలని ఎమ్మెల్యే ఆమెను కోరారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ క్లస్టర్ నా పార్లమెంట్ నియోజకవర్గంలోని పట్టణాలని మహబూబ్ నగర్ క్లస్టర్ అభివృద్ధి చెందితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కూడా ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి సానుకూలంగా స్పందించారని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే తెలిపారు.

## పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ఎలాగని ప్రశ్నించారు. వాటిని ఒకడబ్బాలో ప్యాక్‌చేసి బయో వెస్టేజ్ వెహికిల్‌లో వేసి పంపించాలని సూచించారు. అనంతరం ఆమె ఆస్పత్రిలోని క్యాబోరేట రీ, ఇంజెక్షన్/ డ్రెస్సింగ్ రూమ్, ప్రసూతి గది, ఇన్ పేషెంట్ గదులను పరిశీలించారు. ఆస్పత్రిలో నెలకు ఎన్ని ప్రసవాలు జరుగుతాయని, గత నెలలో ఎన్నిజరిగాయని అడిగి తెలుసుకున్నారు. ఇన్‌వార్డులో చికిత్స పొందుతున్న ఓ గర్భిణికి సంబంధించిన ఆరోగ్య వివరాలకార్డును పరిశీ లించారు. అనంతరం ఆస్పత్రి బయట నిరుపయోగంగా ఉన్న మరుగు దొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని, రోగుల బంధువుల నిరీక్షణ గది చుట్టూ అలాగే ఆస్పత్రి ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగింప చేసి పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఎంపీవో పావనికి సూచించారు.

## పనితీరు మెరుగుపరచాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్కువ మంది ఓపి రోగులు ప్రయోజనం పొందేలా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల సిబ్బంది అందరూ తమ హాజరు నమోదు బయోమెట్రిక్ ద్వారా చేయాలని, ఈ నెలాఖరుకు అన్ని రిజిస్ట్రేషన్లు ఎన్రోల్ చేసి సెప్టెంబర్ 1వ తేదీ నుండి ప్రతి ఒక్కరు బయోమెట్రిక్ ద్వారా తమ హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్లు ప్రతి వారం రెండు సార్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను క్షేత్ర స్థాయిలో సందర్శించాలన్నారు. క్షేత్రస్థాయి పర్యటన సమయంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు హై రిస్క్ రోగులతో సంప్రదించి వారికి తగిన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆశ, ఏఎన్ఎంలు హై రిస్క్ రోగులను గుర్తించి వారికి అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో డెలివరీల సంఖ్య పెంచేందుకు అన్ని స్థాయిల్లో చర్యలు తీసుకుని సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకాన్ని పెంపొందించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య అధికారి సిద్ధప్ప, ప్రోగ్రామ్ ఆఫీసర్ సంధ్య రాణి, మెడికల్ ఆఫీసర్స్, ప్రోగ్రామ్ ఆఫీసర్స్, హెల్త్ సూపర్వైజర్స్, తదితరులు పాల్గొన్నారు.

## వరద ప్రాంతాల్ని పరిశీలించిన ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్

**భూత్పూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వ రెవెన్యూ విపత్తుల నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(స్పెషల్ చీఫ్ సెక్రటరీ) అరవింద్‌కుమార్ ఐఏఎస్ గురువారం భూత్పూర్ మున్సిపాలిటీ, రూరల్ పరిధిలోని వరద ప్రాంతాల్ని పరిశీలించారు. చీఫ్ సెక్రటరీ తొలుత భూత్పూర్ శివారులోని దివిటిపల్లి వద్ద జాతీయ రహదారి-44కు లింక్‌రోడ్‌గా ఉన్న అమరరాజ కంపెనీ భారీ వర్షానికి తెగి కంపెనీకి చెందిన మినీ బస్సు బోల్తా పడింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్, మండల అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు పంపిన నివేదికల ఆధారంగా చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ వరదకు తెగిన అమరరాజ కంపెనీ లింక్‌రోడ్‌ను పరిశీలించారు. భూత్పూర్ మున్సిపాలిటీలోని శేరుపల్లి వద్ద తెగిన కోమటికుంటను పరిశీలించిన అనంతరం బీకర వర్షానికి అమిస్తాపూర్ నుంచి రాందాస్‌తండా రొడ్డునునల్లగుట్టతండా-రాందాస్ తండాలను కలిపే కల్వర్టు వద్ద తెగిపోయిన రొడ్డును పరిశీలించారు. ఈ రొడ్డు తెగిపోవడంతో రెండు తండావాసుల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. వరద నీటి ఉధృతి వల్ల రొడ్డు తెగిపోయినట్టుగా అధికారులు ప్రభుత్వ సీఎస్ అరవింద్‌కుమార్‌కు వివరించారు. వీటితో పాటు సీఎస్ మహబూబ్‌నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి వెళ్లే వర్షపునీటితో నిండిన రైల్వే అండర్‌బ్రిడ్జిని పరిశీలించిన అనంతరం భూత్పూర్ రూరల్ శివారు ప్రాంతం దివిటిపల్లి చిట్టెబోయిన్‌పల్లి వద్ద ఉన్న సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి,, జిల్లా ఎస్పీ డి జానకి, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఏనుగు నర్సింహ్మారెడ్డి, పోలీస్ సీఐ రామకృష్ణ, ఎమ్మార్వో కిషన్‌నాయక్, ఎంపిడీఓ ప్రభాకర్‌చారి, మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్, భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ ఇతర అధికారులు, ఆర్‌అండ్‌బి అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## యూరియా కొరత రైతన్నలను వేధిస్తుంది

**అధిక ధరలకు యూరియా విక్రయాలు**

**చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు**

**దేవరకద్ర, ఆగస్టు 21 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలంలో యూరియా కొరత రైతన్నలను వేధిస్తుంది. యూరియా కోసం రైతులు తెల్లవారుజాము నుండే లైన్లో నిలబడి పడిగాపులు కాస్తున్నారు. గురువారం దేవరకద్ర మండల కేంద్రంలోని సహకార సంఘం సొసైటీ, హకా రైతు సేవ కేంద్రాల వద్ద రైతులు యూరియా కోసం బారులు తీరి క్యూ లైన్ లో నిలబడ్డారు. యూరియా నిల్వ సరిపడ లేకపోవడంతో రైతులందరికీ యూరియా అందకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యూరియ దొరకక రైతులు ఇబ్బందులు పడుతుంటే ఇదే అవకాశంగా భావించి యూరియాను అధిక ధరలకు విక్రయిస్తూ, ప్రైవేట్ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్క యూరియా బస్తా 266 రూపాయలకు విక్రయించాల్సి ఉండగా, ఒక్క షాప్ దగ్గర 290, ఇంకో షాపు దగ్గర 300 రూపాయలకు అమ్ముతున్నారు. ప్రైవేట్ వ్యాపారులు తమకు ఇష్టం వచ్చిన ధరలకు అమ్ముతుంటే దేవరకద్ర వ్యవసాయ అధికారులు మాత్రం చూసి చూడనట్టుగా వ్యవహరించడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన నిర్మించుకోవాలి

**జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్**

**ధన్వాడ, ఆగస్టు 21 ప్రభాతవార్త :** గురువారం ధన్వాడ మండల కేంద్రంలోని బీసీ కాలనీ నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను ఆమె పరిశీలించారు. ఆ కాలనీలో మొత్తం నాలుగు ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగుతుండగా కలెక్టర్ మూడు ఇళ్లను చూశారు. ఒక ఇల్లు స్లాబ్ దశలో, మరో ఇల్లు బేస్ మెంట్, ఇంకో ఇల్లు స్లాబ్ పూర్తయింది. స్లాబ్ పూర్తయిన ఇంటిని చూసిన కలెక్టర్ ఆ ఇంటి లబ్ధిదారురాలైన శారద ను శాలువాతో సన్మానించారు. ధన్వాడ మండలానికి 500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా అందులో ధన్వాడ మండల కేంద్రానికి 102 ఇండ్లు మంజూరు అయ్యాయని వాటిలో స్లాబ్ పూర్తయిన మొదటి ఇల్లు మీదే అని ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెను అభినందించారు. ఇండ్లను దశల వారీగా త్వర త్వరగా నిర్మించుకుంటే డబ్బులు జమ అవుతాయని, మండలంలో మిగతా ఇండ్ల నిర్మాణాలను కూడా తొందరగా నిర్మించుకునేలా అధికారులు లబ్ధిదారులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

## వ్యక్తి దారుణ హత్య..!

**హత్య ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ రావుల గిరిధర్**

**వనపర్తి, ఆగస్టు 21 ప్రభాతవార్త;** వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన బుధవారం రాత్రి పా న్గల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఎనుముల కిష్టయ్య (65)ను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలో హత్య జరిగిన జరిగిన సంఘటన స్థలాన్ని గురువారం రోజు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ స్వయంగా వెళ్లి పరిశీలించి హత్య జరిగిన ఘటనపై ఆరా తీశారు. ఆధారాల కోసం క్లూస్ టీం అన్వేషణ కొనసాగిస్తున్నామని, సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అన్ని కోణాలలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. అదే విధంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, దర్యాప్తు మరింత వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇంటి సమీపంలోని సీసీ కెమెరాలను, చుట్టుపక్కల పరిస్థితులను ఆయన సిబ్బందితో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఆధారాల ఆధారంగా కేసును త్వరితగతిన చేదిస్తామని, నేరస్తులను వెంటనే పట్టుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి సిఐ కృష్ణయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, పానుగల్ ఎస్సై శ్రీనివాసులు ,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ



మృతుడు ఏనుముల కృష్ణయ్య (ఫైల్)

# తెలంగాణకు కేసీఆర్ పాలననే శ్రీరామరక్ష

- అచ్చంపేటపై బీఆర్ఎస్ అధిష్టానం చూపు
- రాబోయే ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేద్దాం ..
- సమన్వయంతో పని చేద్దాం ..
- అచ్చంపేట బిఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త
- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

**అచ్చంపేట, ఆగస్టు 21 ప్రభాతవార్త:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రూపు రాజకీయాలు లేకుండా సమన్వయంతో పార్టీ కోసం కష్టపడి పనిచేసే గులాబీ జెండాను ఎగరవేద్దామని అచ్చంపేట బీఆర్ఎస్ ఇన్‌చార్జి, నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం బల్మూరు మండలంలోని తుమ్మన్‌పేట గ్రామ సమీపంలోని బికె ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి మర్రి జనార్దన్ రెడ్డి, పోకల మనోహర్‌లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలోకి వ్యక్తులు వస్తుంటారు... పోతుంటారుకానీ పార్టీలు మాత్రం శాశ్వతంగా ఉంటాయని తెలిపారు. పార్టీని కాపాడే శక్తి కార్యకర్తలకు మాత్రమే ఉంటుందని, తెలంగాణ రాష్ట్రంలో అచ్చంపేట నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఒక బలమైన సంకేతం ఇచ్చారని అన్నారు. కార్యకర్తలు సమన్వయంతో ఉండి ప్రలోభాలకు లోబడకుండా పార్టీ కోసం నిబద్ధతో పని చేయాలని పార్టీలో మంచి గుర్తింపు ఉంటుంది అన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో అన్ని మండలాల వారీగా పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి కార్యకర్తలకు భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి దాదాపు 20 నెలలు అవుతుందని, అధికారంలోకి రావడం కోసం అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజాపాలన పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన 6 గ్యారెంటీలను, 420 హామీలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తూ ముందుకు వెళ్ళాలని సూచించారు. రాబోయే రోజుల్లో మళ్లీ తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణకు కేసీఆర్ పాలననే శ్రీరామరక్ష అని ప్రజలను చైతన్యం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట మాజీ మున్సిపాలిటీ చైర్మన్ నర్సింహా గౌడ్, తులసి రామ్, మాజీ ఎంపీపీలు కరుణాకర్ రావు, పర్వతాలు, పార్టీ సీనియర్ నాయకులు బండపల్లి వెంకటయ్య, కేటీ తిరుపతయ్య, అమీనొద్దీన్, పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## బాలికలు విద్యలో రాణించాలి: జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**బిజినేపల్లి, ఆగస్టు 21 ప్రభాతవార్త:** విద్య ద్వారానే భవిష్యత్తు మెరుగవుతుంది అని, బాలికలు విద్యలో రాణించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. కలెక్టర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. ప్రత్యేకంగా పదవ తరగతి విద్యార్థులకు స్వయంగా గణితం బోధించిన కలెక్టర్ చదువుతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులకు జిల్లా కలెక్టర్ స్వయంగా గణిత సబ్జెక్టులో పాఠం బోధిస్తూ, వారి అర్థం చేసుకునే స్థాయిని, నేర్చుకునే సామర్థ్యాల ను పరిశీలించారు. గణిత సబ్జెక్టుల్లో కష్టమైన ప్రశ్నలను సులభంగా అర్థమయ్యే రీతిలో వివరిస్తూ విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచేలా కలెక్టర్ బాలికలను ప్రోత్సహించారు క్రమం తప్పకుండా చదువుకోవాలని, పరీక్షల సమయంలో ధైర్యంగా రాయాలని సూచించారు. పాఠశాల విద్య నాణ్యత మెరుగుపడటమే కాకుండా, భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షి ంచారు. పరీక్షల్లో ధైర్యంగా రాయండి అని ఉపాధ్యాయులు చెప్పే విషయాలను శ్రద్ధగా వినండి అని సూచించారు. విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి సృజనాత్మక పద్ధతుల్లో బోధన చేయాలని, ఉపాధ్యాయులకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ముఖ్యంగా గణితంలో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. అంతకుముందు పాఠశాల భవనం, తరగతి గదులు, ప్రాంగణం, పరిసరాల పరిశుభ్రతను సమీక్షి ంచారు. విద్యార్థులు ఎంతమంది తరగతులకు హాజరయ్యారో ఉపాధ్యాయుల హాజరు పరిస్థితి ఎలా ఉందో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అందిస్తున్న బోధన నాణ్యత, మౌలిక సదుపాయాలు, మరుగుదొడ్ల వాడకం, తాగునీటి సౌకర్యం వంటి అంశాలపై సవివరంగా ఆరా తీశారు.

## రేపటి మహాధర్నాను విజయవంతం చేద్దాం

**మహబూబ్‌నగర్, ఆగస్టు 21 ప్రభాతవార్త:** ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ధర్నా చౌక్ లో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు యుయస్పిసి స్టీరింగ్ కమిటీ సభ్యులు ప్రకటించారు. గురువారం మహబూబ్‌నగర్ లోనే టిఎన్‌జిఒ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యుయస్‌పిసి స్టీరింగ్ కమిటి సభ్యులు టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్, డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సోమయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడిచినప్పటికి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో తీవ్రమైన జాప్యాన్ని ప్రదర్శిస్తుందన్నారు. మేనిఫెస్టోలో పొందుపరచిన ఎన్నికల హామీలను అమలు పరచడం లేదని విమర్శించారు. నూతన జిల్లాలకు డిఈఓ పోస్టులను, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఈఓ, నూతన మండలాలకు యంఈఓ పోస్టులను మంజూరు చేసి, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్‌ను రూపొందించి, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని, ఉపాధ్యాయుల పెన్షనర్ల, వివిధ రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ప్రాథమిక పాఠశాలలకు 5571 పియస్ హెచ్‌యం పోస్టులను మంజూరు చేయాలని, డిఎడ్, బిఎడ్ అర్హతలున్న ప్రతి యస్‌జిటికి పియస్ హెచ్‌యం ప్రమోషన్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ చూపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో మహాధర్నా లో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా మహా ధర్నా గోడపత్రికను యుయస్పిసి నేతలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టియస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.రవికుమార్, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రవీందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, టిపి టిఎఫ్. జిల్లా అధ్యక్షులు మహమూద్, ఏపీయుటిఎ జిల్లా అధ్యక్షులు జలీలోద్దీన్, టిఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి.ఉమాదేవి, ఆర్.నర్సింహులు, రాష్ట్ర కమిటి సభ్యులు ఎన్. కిష్టయ్య డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీశైలం, వామనకుమార్, టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణమ్మ, వెంకటేష్, హేమంత్ కుమార్, నర్సప్ప, నాగేశ్వర్, రఫీ, కతలయ్య, జయంతి, నవీన్, రాములు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలను జరుపుకుందాం; ఎస్సై

**చిన్న చింతకుంట, ఆగస్టు 21 ప్రభాతవార్త :** గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని స్థానిక ఎస్సై రామ్‌లాల్ నాయక్ కోరారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ లో వివిధ పార్టీల నేతలు, మత పెద్దలతో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులకు ఆన్లైన్ రిజిస్ట్రేషన్లుతప్పనిసరి, విద్యుత్ సరఫరా, కేబుల్‌ల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గణేష్ మండపాలు వల్ల ఎలాంటి అవరోధాలు లేకుండా చూసుకోవాలి. అట్టి మండపాల స్థలంలో ఇతరులకు ఆటంకం కలిగించే విధంగా ఉండకూడదు. మండపాల నిర్వాహకులు మొదటి రోజు నుంచి నిమజ్జనం అయ్యే రోజు వరకు విధిగా కనీసం ఇద్దరు వ్యక్తులు రాత్రి, పగలు మండపాల వద్ద ఉండేటట్టు చూసుకోవాలన్నారు. రాత్రి సమయాలలో దేవుడి సన్నిధిలో ఉండే లడ్డు ప్రసాదం, హుండీల విషయాలలో జాగ్రత్తలు పాటించాలి. వీలైనంతవరకు తాత్కాలికంగా సీసీ కెమెరాలు నిఘా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. మండపాల వద్ద రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఎలాంటి సౌండ్స్ పెట్టరాదన్నారు. అనుమానిత వ్యక్తుల సమాచారాలను స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం, అత్యవసర పరిస్థితులలో 100 కాల్ చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితులలో వదంతులు, పుకార్లను నమ్మవద్దు నేరుగా పోలీస్ స్టేషన్ కి సమాచారం అందించాలన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలను సామాజిక మాధ్యమాలలో గాని ఇతర పరికరాలతో ప్రేరేపించే వ్యాఖ్యలు పెట్టరాదని ఎస్ఐ సూచించారు. ఈ సమావేశంలో తహసిల్దార్ ఎల్లన్న, వివిధ పార్టీల నేతలు, మత పెద్దలు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పరీక్షలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 21 ప్రభాతవార్త:** తెలంగాణ పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ఆర్‌వియమ్ హాల్‌లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉపకరణాలు ఇవ్వడం కొరకు గుర్తింపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు పది మండలాల దివ్యాంగ విద్యార్థులు సుమారు 150 మంది పాల్గొని వారికి కావలసిన ఉపకరణాలు పొందుటకు నమోదు చేసుకోవడం జరిగింది. ఈ శిబిరాన్ని ఉదయం తొమ్మిదిన్నర గంటలకు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ ప్రారంభించి విద్యార్థులకు కావలసిన పరీక్షలు నిర్వహించి అవసరమైన ఉపకరణాలు అందజేయాలని అలింకో సంస్థ వారిని కోరారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో దివ్యంగా విద్యార్థుల కొరకు ప్రతి మండల కేంద్రంలో భవిత కేంద్రాలు నిర్వహిస్తున్నామని వారికి వారానికి రెండుసార్లు ఫిజియోథెరపీ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా అర్హులైన విద్యార్థులందరికీ కావలసిన అన్ని రకాల స్కాలర్షిప్లను ఇస్తున్నామని తెలియజేశారు కాబట్టి విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సౌకర్యాలను ఉపయోగించుకొని విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్యను అందించాలని ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి సూచించారు. కార్యక్రమంలో సీఎమ్ఓ బాలు యాదవ్, సుధాకర్ రెడ్డి, పది మండలాల స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు, ఐఇఆర్పీలు పాల్గొని ఈ గుర్తింపు శిబిరాన్ని విజయవంతం చేశారు.



పరీక్షలు నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు

## డెడ్లైన్ సెప్టెంబర్ 12.. సీఎంఆర్ డెలివరీ చేయాలి

**అదనపు కలక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ఆదేశం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 21 ప్రభాతవార్త:** 2024, 25 వానాకాలం సీజన్ కు సంబంధించి సియంఆర్ ధాన్యంను నిర్దేశిత సమయంలోగా డెలివరీ చేయాలనిరెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మిల్లర్లను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ కలెక్టర్ ఛాంబర్ లో వానాకాలం 2024,25 సిఎంఆర్ డెలివరీపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి రైస్ మిల్లులో నిలువ ఉన్న ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లింగ్ చేసి సరఫరా చేయాలని మిల్లర్లను ఆదేశించారు. వానాకాలం 202425 ధాన్యం గడువు సెప్టెంబర్ 12 వరకు భారత ప్రభుత్వం పొడిగించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ఈ సీజన్ లో 72105 మెట్రిక్ టన్నులు బియ్యం డెలివరీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 59,306 మెట్రి టన్నుల కస్టమ్ మిల్లింగ్ బియ్యాన్ని అంటే 82 డెలివరీ చేయడం జరిగిందని తెలిపారు. మిగతా 12800 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ బియ్యాన్ని నిర్దేశిత గడువులోపు డెలివరీ చేయాలని ఆయన సూచించారు. సిఎంఆర్ రైస్ సమయానికి సరఫరా చేయడం ద్వారా పేదలకు ప్రభుత్వ పథకాల ద్వారా అందించే ఆహార భద్రతలో ఎటువంటి అంతరాయం కలగకుండా ఉంటుందని ఆయన అన్నారు. సన్న బియ్యాన్ని సమర్థవంతంగా డెలివరీ చేయాలని సూచించారు. ప్రతి రైస్ మిల్లులో నిలువ ఉంచిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఎ.రవి నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, పౌర సరఫరాశాఖ డీటీలు, మిల్లర్లు, పాల్గొన్నారు.

## పిఆర్‌టియు ఆధ్వర్యంలో మహాధర్న పోస్టర్ ఆవిష్కరణ

**సిపిఎస్ అంతం పిఆర్‌టియు టీఎస్ పంతం వసంతపురం రాజు**

**శ్రీరంగాపూర్, ఆగస్టు 21 ప్రభాతవార్త :** సెప్టెంబర్ ఒకటి 2025 పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా పిఆర్‌టియు శ్రీరంగాపూర్ మండల శాఖ అధ్యక్షులు వసంతపురం రాజు, ప్రధాన కార్యదర్శి నాయిని విష్ణువర్ధన్ నాయుడు, ఆధ్వర్యంలో శ్రీరంగాపూర్ మండల వనరుల కేంద్రంలో భోజన విరామ సమయంలో ముఖ్య అతిథులు, యూనియన్ వారి చేతుల మీదుగా మహాధర్నా పోస్టరు ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీరంగాపూర్ మండల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నాగేంద్ర గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా టిఆర్‌టియు టీఎస్ శ్రీరంగాపూర్ మండలశాఖ అధ్యక్షులు వసంతపురం రాజు మాట్లాడుతూ మ్యాని పెస్టో లో చెప్పిన విధంగా ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓ పి ఎస్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు యూనియన్ ఆధ్వర్యంలో వేలాదిమందితో శాంతియుతంగా మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఇట్టి మహాధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు అందరూ స్వచ్ఛందంగా సిఎల్ పెట్టుకుని హాజరు కావాలని పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రామచంద్రయ్య, శివ శంకర్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జయంత్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు నరేష్, సుధాకర్, మండల కార్యవర్గ సభ్యులు దామోదర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మోజెస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాల లెక్చరర్లు, జూనియర్ అసిస్టెంట్లు, ప్రాథమిక కార్యకర్తలు పాల్గొన్నారు.

**యూరియా అక్రమ రవాణాను**

## అరికట్టేందుకు చెక్పోస్ట్ ఏర్పాటు

**కృష్ణ, ఆగష్టు 21 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా నుండి ఇత ర రాష్ట్రాలకు యూరియా అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్ పోస్టు ఏర్పాటు చేశామని ఎస్ఐ నవీద్ అన్నారు. నారాయ ణపేట, కర్ణాటక బోర్డర్లో యూరియా అక్రమ రవాణా పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌లో సిబ్బంది 24/7 నిరంతరం పగడ్బందీగా అప్రమత్తంగా ఉంటూ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహిస్తూ యూరియా అక్రమ రవాణా చేసే వారిని పట్టుకోవడం జరుగుతుందన్నారు. యూరియా ఎరువులు దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎరువుల నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘించి అక్రమంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని కృష్ణ ఎస్సై నవీద్ తెలిపారు. గురువారం కృష్ణ మండలం తహసిల్దార్‌తో కలిసి కృష్ణ చెక్‌పోస్టును తనిఖీ చేయడం జరిగిందని ఎస్సై నవీద్ తెలిపారు.

## యూరియాను వ్యవసాయ సాగుకు మాత్రమే వినియోగించాలి

**బిజినేపల్లి ఆగస్టు 21 ప్రభాతవార్త:** రైతులు ఒకేసారి కాకుండా తమ అవసరాలకు అనుగుణంగా ఎరువులను తీసుకువెళ్లాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. మండల కేంద్రంలోని మన గ్రోమోర్ వ్యవసాయ క్రిమిసంహారక మందుల విక్రయ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గురువారం ఆకస్మికంగా సందర్శించి, సేల్స్ రిజిస్టర్ ను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యూరియాను వ్యవసాయ సాగుకు మాత్రమే వినియోగించాలి అని రైతులకు సూచించారు. రైతులు భూమి ప్రకారమే ఎరువులు వాడాలని, అధిక వాడకం వల్ల నేలా సాంద్రత దెబ్బతింటుందని కలెక్టర్ సూచించారు. రికార్డుల్లో రాసిపెట్టిన ఎరువు నిలువలను, గోదాములో ఉన్న యూరియా నిలువలను పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు ఎరువుల అమ్మకాలపై పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

## పనుల జాతర కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**ఊట్కూర్. ఆగస్ట 21 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నేడు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచనల మేరకు "పనుల జాతర 2025 " అనే కార్యక్రమాన్నీ మండలంలోని 23 గ్రామ పంచాయతీలలో చేపట్టడం జరుతుంది. ఇందులో భాగంగా, పంచాయత్ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, స్వచ్ఛభారత్ మిషన్ పంచాయతి రాజ్, ఇంజనీరింగ్ శాఖల ద్వారా మంజూరైన పనులకు భూమిపూజ, పూర్తయిన పనులను ప్రారంభించుకోవడం, అలాగే గ్రామసభలు నిర్వహించుకొని గ్రామాల్లో ఇంతవరకు చేపట్టిన పనుల వివరాలు ఎన్ఆర్ఈజిఎస్ క్రింద రాబోవు రోజులలో చేపట్టే పనుల జాబితా చదివి వినిపిస్తారు, గ్రామంలో ఉపాధి కూలి ఎవరైతే ఎక్కువ పనిదినాలు చేశారో వారిలో పెద్దవయస్సు వారినీ వికలాంగ ఉపాధి కూలీలలో ఎక్కువ పని దినాలు చేసిన ఒకరిని అలాగే గ్రామపంచాయతీ ఎంపిడబ్లును ఈ గ్రామసభలో సన్మానించుకోవాలని ఇట్టి కార్యక్రమానికి గ్రామ స్థాయి అధికారులు, అందరూ ప్రజాప్రతినిధులు వారి వారి గ్రామాలలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఓ ధనుంజయగౌడ్ తెలిపారు.

## జిల్లా వ్యవసాయ అధికారికి బికేఎస్ నాయకులు వినతి

**నారాయణపేట టౌన్, ఆగస్టు 21 ప్రభాతవార్త :** కురుస్తున్న వర్షాల కారణంగా నారాయణపేటజిల్లాలో రైతులు సాగుచేసి న పత్తి, కంది, పెసర, మినుము, జొన్న, ఆముదము, వివిధ పప్పు ధాన్యాలు కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిలిందని పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా నాయకులు ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు సాగు చేసిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. రైతు దిక్కుతోచని స్థితిలో ఉన్నర న్నారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోని నష్టపరి హారం అదించాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర జూనల్ కార్యదర్శి వెంకోబ, జిల్లా కార్యదర్శి అనంత్‌రెడ్డి, లక్ష్మి నారాయణ, లక్ష్మి కాంత్, జాజాపూర్, రాము, గోపాల్ యాదవ్, రాంమోహన్‌తో బాటు తదితరులు ఉన్నారు.

## పలువురిని ఆకట్టుకున్న టిఎల్ఎం మేళా

**లింగాల, ఆగస్టు 21 ప్రభాతవార్త:** విద్యార్థులకు అర్థమయ్యే సు లువైన పద్ధతిలో నేర్పించడానికి ఈ టిఎల్ఎం మేళా ఉపయోగపడుతుందని మండల విద్యాధికారి బషిర్ అహ్మద్ అన్నారు. గురువారం లింగాల మండల కేంద్రంలోని ఎమ్మార్సి కార్యాలయ ఆవరణలో నిర్వహించిన టిఎల్ఎం మేళా పలువురిని ఆకట్టుకుంది. ఈ మేళాకు మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ మేళా ప్రదర్శనలో మొదటి బహుమతి యుపిఎస్ అప్పాయిపల్లి, రెండవ బహుమతి పియస్ ఆవుసలికుంట, గణితంలో మొదటి బహుమతి పియస్ జీల్గుపల్లి, రెండవ బహుమతి యుపిఎస్ చెన్నంపల్లి, ఇంగ్లీష్ లో మొదటి బహుమతి పిఎస్ లింగాల, రెండవ బహుమతి పిఎస్ ఆవుసలికుంట, ఈవీఎస్ లో మొదటి బహుమతి యుపిఎస్ చెన్నంపల్లి, రెండవ బహుమతి సిపిఎస్ లింగాలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబటిపల్లి కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు నిరంజన్, జడ్జిలుగా శ్రీనివాస్ రెడ్డి ,రమేష్, నరసింహ, శేఖర్ వ్యవహరించారు. వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరవింద్, శివప్రసాద్, పాండురంగం, సతీష్, పర్వతాలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ,సాయి కిరణ్, హరిలాల్, విష్ణు, వర్మ పాల్గొన్నారు.